



ఎంత బ్రతిమిలాడినా రాడమ్మా..!

అమ్మ రోదన



చిగిలి గ్రామంలో శ్మశాన వైరాగ్యం

ప్రతి గడపా కన్నీటిమయం

వివరాలు 7వ పేజీలో

చిగిలి గ్రామం శోకసంద్రంలో మునిగిపోయింది. కన్నీటి వరద కట్టలు తెగింది. శ్మశానం సైతం గుండెలు పగిలేలా రోదించింది. ఒకరా ఇద్దరా ఆరుగురు చిన్నారులు.. ఏ ఇంట చూసినా ఏడుపులే. ఏ కంట చూసినా ఉబికివస్తున్న కన్నీరు. తల్లిదండ్రులను, తోబుట్టువులు, స్నేహితులు, బంధువులను కన్నీటి సుడిలో నెట్టివేసిన ఆరుగురు చిన్నారులు అందరినీ వదిలేసి అంతులేని వ్యథను మిగిల్చారు. 'కొడుకా.. లేరా.. నాయనా, బిడ్డా, బంగారు, బుజ్జికన్నా..' అంటూ తల్లిదండ్రుల ఏడుపులు.. 'నన్ను వదిలిపోయేందుకు నీకు మనసెలా వచ్చింది..' అంటూ కన్న బిడ్డల అచేతన శరీరాలపై పడి గుండెలు పగిలేలా రోదనలు.. ఏ గడప చూసినా కన్నీటి సంద్రమే. ఏడ్చిఏడ్చి కన్నీళ్లు ఆవిరైపోయాయి గానీ వారి గుండెల్లో బాధ మాత్రం ఇసుమంత కూడా తగ్గలేదు. చుట్టపక్కల పల్లెలన్నీ ఓదార్పునకు వరదలా కదిలొచ్చాయి. చనిపోయిన చిన్నారులతో ఉన్న ఆత్మీయతను, అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ విలపించిన తీరు అందరినీ కలచివేసింది. బుధవారం నీటి గుంతలో పడి మృతి చెందిన ఆరుగురు చిన్నారుల అంత్యక్రియలు గురువారం ఆస్పరి మండలం చిగిలి గ్రామంలో ముగిశాయి. ఊరు ఊరంతా వల్లకాడుగా మారినట్టు రోదనలు, ఆర్తనాదాలతో పల్లె కన్నీరు పెట్టుకుంది. చిన్నారుల మృతదేహాలు శ్మశానం వైపు కదులుతుంటే... బరువెక్కిన హృదయంతో ప్రతి ఒక్కరూ వెంటసాగారు. రోజా యూనిఫాంలో భవిష్యత్తు కోసం కోటి ఆశలతో బడికి వెళ్లే ఆ చిన్నారులు ఈరోజు అదే బడి ఎదుట శవాలైపోయారు.

చిగిలి గుండె పగిలి

- చిగిలి గ్రామంలో ముగిసిన ఆరుగురు చిన్నారుల అంత్యక్రియలు
- వందలాదిగా తరలివచ్చిన ప్రజలు
- కన్నీరు పెట్టిన ఊరు



శశికుమార్ మృతదేహంతో..

ఆదోని/ఆస్పరి/ఆదోని రూరల్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): సరదాగా ఈతకు వెళ్లి ఆరుగురు చిన్నారులు మృతి చెందడంతో ఊరు కన్నీరు పెట్టింది. ఆరు కుటుంబాలు ఆర్తనాదాలతో అంతిమ వీడ్కోలు పలికాయి. ప్రతిరోజూ పాఠశాలకు వెళ్లినా... ఆటలు ఆడినా.. ఒక్కటిగానే కలిసిమెలిసి ఉండేవారు. విధిరాతలో ఒకరిని కాపాడడానికి వెళ్లి మరొకరు అలా ఆరుగురు చిన్నారులు నీటికుంటలో మునిగి అసువులు బాశారు. చివరికి చావులోనూ వీరు స్నేహాన్ని వీడలేదు. వీరి అంత్యక్రియలు గురువారం కన్నీటిసుడుల మధ్య పూర్తయ్యాయి. వీరి రోదనలు చూసిన ఆ గ్రామం కన్నీళ్లు కార్చింది. ఆస్పరి మండలం చిగిలి గ్రామానికి చెందిన వై.కిన్నెరసాయి(10), శశికుమార్(10), సాయికిరణ్(10), భీమేష్(10), వినయ్(10), మహబూబ్‌బాషా(10)లతో పాటు దుర్గాప్రసాద్ స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి చదువుతున్నారు.



కడదారి..

చిన్నారుల శవాలతో శ్మశానవాటిక వైపు తరలివెళ్తున్న ప్రజలు



భూగర్భ జలాల పెంపునకు చర్యలు తీసుకోవాలి

- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్
- వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన జిల్లా అధికారులు



కర్నూలు కలెక్టరేట్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో భూగర్భ జలాల పెంపునకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ కలెక్టర్లను ఆదేశించారు. అన్ని జిల్లాల కలెక్టర్లతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పలు ప్రభుత్వ అంశాలపై సమీక్షించారు. స్వామిత్ర, మైనర్ ఇరిగేషన్, స్వచ్ఛాంధ్ర అవార్డులు జువైనల్ కేసులు, పాజిటివ్ పబ్లిక్ పెరసెప్షన్ వంటి మొదలగు విషయాలు చర్చించి తగు సూచనలు ఇచ్చారు. స్వచ్ఛ గ్రామం, స్వచ్ఛ మున్సిపాలిటీ, స్వచ్ఛ హాస్పిటల్, స్వచ్ఛ బస్టాండు, స్వచ్ఛ హాస్టల్, స్వచ్ఛ ప్రభుత్వ కార్యాలయం, స్వచ్ఛ అంగన్‌వాడీలకు జిల్లాలో స్వచ్ఛ అవార్డులు, రాష్ట్ర స్థాయి అవార్డులు అక్టోబరు 2న ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కర్నూలు కలెక్టర్ పి.రంజిత్ బాషా, జేసీ బి.నవ్య, డీఆర్వో వెంకట నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

గణేశ్ ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేలా చూడాలి

- పోలీసు అధికారులకు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశం

కర్నూలు క్రైం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 27 నుంచి వినాయకచవితి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయని, ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా చూడాలని ఎస్పీ విక్రాంత్ పాటిల్ సూచించారు. గురువారం కర్నూలు జిల్లా పోలీస్ కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియంలో డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలతో నేర సమీక్ష సమావేశం నిర్వహించి పోలీసు అధికారులకు పలు సూచనలు చేశారు. ఎస్పీ మాట్లాడుతూ వినాయక చవితి ఉత్సవాలకు పోలీసు బందోబస్తు గట్టిగా ఏర్పాటు చేయాలన్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా వినాయక మండపాలు ఏర్పాటు చేసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే మండపాలు ఏర్పాటు చేసుకునే నిర్వాహకులు ఆన్‌లైన్‌లో 'గణేశ్ ఉత్సవ్.నెట్' వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలన్నారు. ఈమేరకు స్థానిక పోలీసులు క్షేత్రస్థాయిలో పరిశీలించి నిబంధనలకు అనుగుణంగా ఉన్న మండపాలకు అనుమతులిస్తారని చెప్పారు. పెద్ద వినాయక విగ్రహ మండపాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించాలన్నారు. అలాగే మండపాల వద్ద భక్తి పాటలు ఉదయం 6 నుంచి రాత్రి 10 గంటల వరకు మాత్రమే ఉండాలన్నారు. హోరెత్తించే పెద్ద శబ్దాలతో ఎవరికీ ఇబ్బంది కలిగించకూడదన్నారు. సెప్టెంబరు 4న నిమజ్జనం ఉంటుందని, అందుకు తగ్గ బందోబస్తు సిద్ధం చేయాలని ఆదేశించారు. ప్రతి కేసు వివరాలను సీసీటీఎన్ఎస్‌లో డిజిటలైజేషన్ చేయాలన్నారు. ప్రతి సబ్ డివిజన్‌కు ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబోరేటరీ టీమ్‌లు, క్రైం స్పాట్ వాహనాలు త్వరలో ఏర్పాటు చేయబోతున్నట్లు తెలిపారు. అలాగే వాట్సాప్ ద్వారా మెయిల్ ఐడీగానీ, రిజిస్టర్ పోస్టుల ద్వారా పోలీసులకు ఫిర్యాదులు వచ్చినప్పుడు విచారించి కేసులు నమోదు చర్యలు తీసుకోవాలని తెలిపారు. రోడ్డు ప్రమాదాలను తగ్గించేలా డిజిటల్ సైన్ బోర్డులు, హోర్డింగ్స్ వంటి ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. రౌడీషీటర్ల కదలికలపై నిఘా ఉంచాలన్నారు. కార్డన్ సెర్చ్‌లు, వాహనాల తనిఖీ తరుచుగా చేయాలన్నారు. శాంతిభద్రతకు తీవ్రమైన నేరాలకు పాల్పడే హిస్టరీ షీట్స్ ఉన్న వారిని జిల్లా బహిష్కరణ కోసం పీడీ యాక్టుల సిద్ధం చేయాలని ఆదేశించారు. కొత్తగా వచ్చిన ప్రొబేషనరీ ఎస్ఐలు ప్రతి క్రైం మీటింగ్ తప్పనిసరిగా హాజరు కావాలన్నారు. కోర్టులో పెండింగ్ కేసులను త్వరగా ట్రయల్‌కు వచ్చేలా కృషి చేయాలన్నారు. అనంతరం గత నెలలో కేసులలో ప్రతిభ కనబరిచిన పోలీసు అధికారులు, పోలీసు సిబ్బందికి ఎస్పీ ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ హుస్సేన్‌పీరా, లీగల్ అడ్వైజర్ మల్లికార్జునరావు, డీఎస్పీలు వెంకట్రామయ్య ఉపేంద్రబాబు, హేమలత, భార్గవి, సీఐలు ఎస్ఐలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ

పంచాయతీ కార్యదర్శులకు పోస్టింగ్‌లు

కర్నూలు కలెక్టరేట్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో పనిచేస్తున్న గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శులకు పదోన్నతులను ప్రభుత్వం కల్పించింది. ఈ మేరకు 120 మంది పంచాయతీ కార్యదర్శులకు గురువారం నూతన స్థానాలను కేటాయించారు. పదోన్నతుల ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. కానీ జిల్లా గ్రామ పంచాయతీ కార్యాలయంలో పనిచేసే సిబ్బంది కొంత మందిని బినామీలను ఏర్పాటు చేసుకుని వసూళ్లకు పాల్పడ్డారనే ఆరోపణలు వెలువెత్తుతున్నాయి.



ఓల్డ్ పంప్‌హౌస్ దగ్గర తుంగభద్రలో కలుస్తున్న మురుగు (ఫైల్)

కార్పొరేషన్‌పై ఎన్‌జీటీ ఆగ్రహం..!

- తుంగభద్ర నదిలోకి యథేచ్ఛగా మురుగు
- కలుషితం అవుతున్న నదులు
- రూ.5.20 కోట్లు అపరాధ రుసుము
- అప్పీల్‌కు వెళ్లిన కార్పొరేషన్ అధికారులు
- మురుగునీటి శుద్ధి కేంద్రాల నిర్మాణంలో జాప్యం
- ఇంజనీర్లకు మెమో జారీచేసిన కమిషనర్

తుంగభద్ర నది కాలుష్య కోరల్లో చిక్కుకుందా..? అంటే అవుననే అంటున్నారు కాలుష్య నియంత్రణ మండలి అధికారులు. కర్నూలు నగరపాలక సంస్థ డ్రైనేజీలను నేరుగా నదిలోకి వదిలేశారు. మురుగు చేరికతో నదీజలాలు కలుషితం అవుతున్నట్లు నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్‌జీటీ), సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు (సీపీసీబీ) అధికారులు క్షేత్ర స్థాయిలో తనిఖీలుచేసి తుంగభద్ర జలాలు విషపూరితం అవుతున్నాయని గుర్తించారు. కార్పొరేషన్‌కు రూ.5.20కోట్లు అపరాధ రుసుం చెల్లించాలని నోటీసులు జారీచేశారు. నది ఏస్థాయిలో కాలుష్య కోరల్లో చిక్కుకుందో ఇట్టే తెలుస్తోంది. తుంగభద్ర, హంద్రీ నదుల్లో కలిసే మురుగునీటిని శుద్ధిచేయాలని గత టీడీపీ ప్రభుత్వ హయాంలో రూ.9కోట్లతో మురుగు నీటిశుద్ధి కేంద్రాలు (ఎస్‌టీపీ) నిర్మాణాలు చేపట్టినా ఏళ్లు గడుస్తున్నా ముందుకు సాగడం లేదు. నిర్లక్ష్యంపై కమిషనర్ విశ్వనాథ్ ఇంజనీర్లకు నోటీసులు జారీ చేశారు. ఆ వివరాలపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

కర్నూలు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): కర్నూలు నగర జనాభా ప్రస్తుతం జనాభా ఆరు లక్షలకు పైగా చేరిందని అంచనా. 51 వార్డులు ఉన్నాయి. ప్రజల తాగునీరు, వివిధ అవసరాల కోసం రోజుకు 75-80 మిలియన్ లీటర్లు (ఎంఎల్‌డీ) సరఫరా చేస్తున్నారు. అందులో 65-70 శాతం నీరు ప్రజల వినియోగం తర్వాత 50-55 ఎంఎల్‌డీ నీరు మురుగు కాల్వలకు చేరుతుందని ఇంజనీర్లు అంచనా వేస్తున్నారు. ఓల్డ్ తుంగభద్ర పంప్‌హౌస్, రోజాదర్గా, సంకల్‌బాగ్, సాయిబాబా టెంపుల్, బండిమెట్ట, రాంబోట్ల టెంపుల్ ఏరియా తదితర 14 ప్రాంతాల్లో తుంగభద్ర నదిలో మురుగునీరు కలుస్తుంది. కల్లూరు, కల్లూరు ఎస్టేట్, దేవానగర్, కృష్ణానగర్, చెన్నమ్మ సర్కిల్ తదితర కాలనీలకు చెందిన మురుగునీరు హంద్రీనది, వక్కలేరు వాగుల్లో కలసి జోహరాపురం వంతెన సమీపంలో తుంగభద్రలో చేరుతుంది. నదీజలాలు ఏమేరకు కలుషితం అవుతున్నాయో..? అని ఏపీ వాతావరణ కాలుష్య నియంత్రణ మండలి అధికారులు మురుగునీటి సమూనాలు సేకరించి పరీక్షలు చేస్తే విషపూరితాలు ఉన్నట్లు వెలుగు చూసినట్లు సమాచారం. మురుగునీటి వల్ల తుంగభద్ర ఏరీతిన కలుషితం అవుతుందో 'ఆంధ్రజ్యోతి' సహా పలు పత్రికలు కథనాల ద్వారా వెలుగులోకి తెచ్చాయి.

-మిగతా 6వ పేజీలో



పంచాయతీల్లో వైసీపీ హయాంలో పాలన గాడి తప్పింది. అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు తమ చేతివాటాన్ని ప్రదర్శించారు. అందినకాడికి దోచుకున్నారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా లక్షల నిధులు స్వాహా అయ్యాయి. జిల్లాలోని పలు అసెంబ్లీ నియోజకవర్గాల్లో, పలు పంచాయతీల్లోని నిధులు గోల్‌మాల్ అయ్యాయి. దీన్ని చక్కదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. సెప్టెంబరు ఒకటి నుంచి పంచాయతీలో ఆర్థిక అంశాలను సమగ్ర వివరాలతో స్వర్ణ పంచాయతీ పోర్టల్‌లో బ్లీచింగ్, వీధి దీపాలు, శానిటరీ పరికరాలు, పారిశుధ్య, పనులు తదితర వివరాలన్నీ బిల్లులు అప్‌లోడు చేయాలి. అనంతరం సీఎఫ్‌ఎంఎస్ ఆమోదం తెలుపుతాయి. గ్రామ పంచాయతీల్లో ఆస్తిపన్ను వివరాలు ఆన్‌లైన్ ప్రక్రియకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. 'స్వర్ణ పంచాయతీ' పోర్టల్‌తో స్వాహా పర్వానికి చెక్ పెట్టేందుకు సిద్ధమైంది.



స్వర్ణ పంచాయతీతో స్వాహాకు చెక్

24 మండలాల్లో సరాసరిగా ఐదు శాతం మాత్రమే..

- ఆస్తి, నీటి పన్నుల వసూళ్లలో వెనుకంజ
- నిధుల స్వాహాల్లో ఉద్యోగులు ముందంజ
- ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్న అధికారులు
- ప్రక్షాళన దిశగా ప్రభుత్వం అడుగులు
- సెప్టెంబరు 1 నుంచి ఈ పోర్టల్‌లో బిల్లులన్నీ నమోదు

కర్నూలు కలెక్టరేట్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో గ్రామ పంచాయతీల పాలన గాడి తప్పింది. దీపం ఉండగానే ఇల్లు చక్క దిద్దుకోవాలనే ఆలోచనలో కొందరు అధికారులు చేతివాటం ప్రదర్శించారు. ప్రజల సొమ్మును కాజేశారు. పంచాయతీల సర్వతోముఖాభివృద్ధి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విడుదల చేస్తున్న నిధులు పక్కదారి పట్టాయి. గ్రామాల అభివృద్ధి కోసం పనిచేయాల్సిన కొందరు సర్పంచులు ఉప సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, డీఎల్‌పీవోలు అందినకాడికి దండుకున్నారు. అక్రమార్కులకు అధికారుల అండదండలు ఉండటంతో నిధులు దుర్వినియోగం వెలుగులోకి రావడం లేదని విమర్శలున్నాయి. జిల్లాలో ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా లక్షల నిధులు స్వాహా అయ్యాయి. పలు అసెంబ్లీ నియోజకవర్గాల్లో పలు పంచాయతీల్లో నిధులు గోల్‌మాల్ అయ్యాయి. పన్నుల రూపంలో ప్రజలు చెల్లించిన నగదును పంచాయతీకి జమ చేయకపోవడం, చేయని పనులు చేసినట్లు చిత్రీకరించి బిల్లులు పొందడం.. కాంట్రాక్టు సిబ్బంది జీతాల పేర్లతో నగదు కాల్ చేయడం, జిల్లా అధికారుల ఖర్చుల పేర్లతో నకిలీ బిల్లులతో నగదును డ్రా చేశారు. అధికారులు విచారణ పేరుతో కాలయాపన చేస్తుండటంతో అక్రమార్కుల పదవి కాలం ముగుస్తోందన్న విమర్శలు ఉన్నాయి. గత ప్రభుత్వంలో జరిగిన పంచాయతీల నిధుల దుర్వినియోగంపై జిల్లా విజిలెన్స్ అధికారులు విచారణ చేపట్టాలని ప్రజా సంఘాలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాయి.



జిల్లా పంచాయతీ కార్యాలయం

ప్రభుత్వానికి రావాల్సిన నీటి పన్ను విషయంలో జిల్లా పంచాయతీ అధికారులు పూర్తిగా నిర్లక్ష్య ధోరణిలో ఉన్నారని విమర్శలు ఉన్నాయి. క్రిష్ణగిరి, పెద్దకడుమూరు మండలాల్లో ఇంతవరకు ఒక్క రూపాయి కూడా వసూలు కాలేదు. కేవలం కోడుమూరు మండలంలో మాత్రమే 90 శాతం ప్రజలు నీటి పన్ను కట్టారు. మిగతా 24మండలాల్లో సరాసరిగా ఐదు శాతం కూడా నీటి పన్ను వసూలు చేయలేదు. జిల్లా పంచాయతీ అధికారుల నిర్లక్ష్య ధోరణితో ప్రభుత్వానికి రావాల్సిన ఆస్తి , నీటి పన్ను విషయంలో చూసీచూడనట్లు వ్యవహరించడం పలు విమర్శలకు తావిస్తోంది. ఆస్తిపన్ను వసూళ్లలో జిల్లా పంచాయతీ కార్యదర్శులు పూర్తిగా వెనుకబడి ఉన్నారు. జిల్లాలో గోనెగండ్ల, కౌతాళం, ఆదోని, హాలహర్వి, క్రిష్ణగిరి, కోసిగి, పెద్దకడుమూరు, ఆలూరు, తుగ్గలి, ఆస్పరి, దేవనకొండ, హోళగుంద మండలాల్లో 50 శాతం కూడా ఆస్తి పన్నులు వసూలు కాలేదు. కేవలం కోడుమూరు, చిప్పగిరి మండలాల్లో మాత్రమే 90 శాతం ఆస్తి పన్ను వసూలు కావడం జరిగింది.

సమగ్ర వివరాలతో..

సెప్టెంబరు 1వ తేదీ నుంచి పంచాయతీలో ఆర్థిక అంశాలను సమగ్ర వివరాలతో స్వర్ణ పంచాయతీ పోర్టల్‌లో బ్లీచింగ్, వీధి దీపాలు, శానిటరీ పరికరాలు, పారిశుధ్య పనుల బిల్లులు అప్‌లోడు చేయాలి. అనంతరం సీఎఫ్‌ఎంఎస్ ఆమోదం తెలుపుతాయి. గ్రామ పంచాయతీలలో ఆస్తిపన్ను వివరాలు ఆన్‌లైన్ ప్రక్రియకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. 2025-26 ఆర్థిక సంవత్స రానికి సంబంధించి ప్రజలకు ఆన్‌లైన్‌లోనే డిమాండ్ నోటీసులు జారీ చేయనున్నారు. పన్ను వసూలు నగదు రహితంగా చేపట్టనున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో పన్నుల వసూలు ప్రజల నుంచి ఎంత వసూలు చేశారో.. బ్యాంకులో ఖాతాల్లో ఎంత జమ చేశారో కూడా కార్యాలయంలో సరైన లెక్కలు లేవు. జిల్లాలోని కొంత మంది పంచాయతీ కార్యదర్శులు పన్ను మొత్తాన్ని జేబులో వేసుకుని సొంత అవసరాలు వాడుకున్నాడని ఫిర్యాదులు వెలువెత్తుతున్నాయి.

ఆస్తి, నీటి పన్ను కచ్చితంగా కట్టాలి



2024-25 సంవత్సరానికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న ఆస్తి, నీటి పన్ను బకాయిలను కచ్చితంగా కట్టాలి. ఎవరైనా అవినీతికి పాల్పడితే ప్రభుత్వ నిబంధనల ప్రకారం పంచాయతీ కార్యదర్శులు, డిప్యూటీ ఎంపీడీవోలు, డీఎల్‌పీవోలపై చర్యలు తీసుకుంటాం.

● భాస్కర్, డీపీవో, కర్నూలు

రుధిరంతో చిరంజీవి చిత్రం



సినీ హిరో మెగాస్టార్ చిరంజీవి 70వ జన్మదినం సందర్భంగా నందికొట్కూరుకు చెందిన శ్రీనివాసులు తన రక్తంతో గురువారం చిరంజీవి చిత్రాన్ని గీశారు. సినీ పరిశ్రమలో ప్రాణం ఖరీదు సినిమాతో అడుగుపెట్టిన తాను విశ్వంభర చిత్రంతో జనం ముందుకు వస్తున్నారని శ్రీనివాసులు పేర్కొన్నారు. ఈవయస్సులో కూడా యువ హీరోలతో పోటీ పడుతూ ప్రజల అభిమానాన్ని పొందుతున్నారని, ఆయన ఆయురారోగ్యాలతో వందేళ్ల జీవించాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు ఆయన తెలిపారు.

● నందికొట్కూరు, ఆంధ్రజ్యోతి

రోగులకు కనీస సౌకర్యాలేవీ?

- ఎంసీహెచ్ బ్లాక్ వద్ద దోమల బెడద
- క్యాజువాల్టీలో స్ట్రెచర్ కోసం వసూళ్లు
- సిబ్బంది లేక బంధువులే తోస్తున్న వైనం


ప్రసూతి విభాగం ఎదుట అర్ధరాత్రి రోడ్డుపైన నిద్రిస్తున్న బంధువులు

కర్నూలు హాస్పిటల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో రోగులకు కనీససౌకర్యాలు లేక ఇక్కట్లు పడుతున్నారు. హాస్పిటల్‌కు ప్రతి రోజు 2,500 నుంచి 3వేల మంది రోగులు ఏడు జిల్లాల నుంచి చికిత్స కోసం వస్తుంటారు. బుధవారం అర్ధరాత్రి 12 గంటలకు 'ఆంధ్రజ్యోతి' విజిట్ చేసింది. ఈ విజిట్‌లో రోగులకు కనీస సౌకర్యాల కరువయ్యాయి. ప్రసూతి విభాగం వద్ద కాన్పులకోసం వచ్చిన గర్భిణులకు, సహాయకులకు సౌకర్యాలు కరువయ్యాయి. ఈ విభాగం ఎదుట రోడ్డుపై బంధువులు నిద్రిస్తున్నారు. దోమల బెడద ఎక్కువగా ఉందని, అధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఇక చిన్న పిల్లల విభాగం ఈఎస్ఆర్ అత్యవసర వార్డు సమీపంలో మురుగు నిలిచిపోవడంతో దుర్వాసన వస్తోందని బంధువులు చెప్పారు. పైపులైన్లు ధ్వంసం కావడం వల్ల నీరు ఒక చోట నిలిచిపోయి వాసన వస్తోందన్నారు. క్యాజువాల్టీలో అత్యవసర రోగులకు పడకలు కరువయ్యాయి. ఒకే మంచంపై ఇద్దరు రోగులకు పడుకోబెట్టి చికిత్స అందిస్తున్నారు. ఇక క్యాజువాల్టీలో స్ట్రెచర్లు, వీల్ చైర్లకు పారిశుధ్య కార్మికులు డబ్బులు అడుగుతున్నారని రోగుల బంధువులు ఫిర్యాదు చేశారు. రోగులకు స్ట్రెచ్చర్‌పై ఉంచి బంధువులే పరీక్షల కోసం తీసుకెళ్తున్నారు. రాత్రి 11.50 గంటలకు క్యాజువాల్టీ సీఎంవో డా.శ్వేత విధుల్లో ఉన్నారు. రాత్రి పూట క్యాజువాల్టీలో ఇద్దరు సీఎంవోలను ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని రోగులు కోరుతున్నారు. అర్ధరాత్రి కొందరు ప్రైవేటు ల్యాబ్ టెక్నీషియన్లు క్యాజువాల్టీ, గైనిక్ వార్డుల దగ్గర ఉండి పరీక్షల కోసం శ్యాంపిళ్ల తీసుకెళ్తున్నారు.


క్యాజువాల్టీలోని రెడ్‌జోన్‌లో ఒకే బెడ్‌పై ఇద్దరు రోగులు

కార్పొరేషన్‌పై ఎన్‌జీటీ ఆగ్రహం..

(5వ పేజీ తరువాయి)

నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్‌జీటీ) సుమోటోగా కేసు నమోదు చేసి విచారణ చేపట్టింది. కార్పొరేషన్ విడుదల చేస్తున్న మురుగునీటి వ్యర్థాల వల్లే తుంగభద్ర జలాలు కలుషితం అవుతున్నాయని నిగ్గు తేల్చింది. రూ.5.20 కోట్లు అపరాధ రుసుం (ఫైన్) చెల్లించాలని చెన్నైలోని ఎన్‌జీటీ 2024 డిసెంబరు 23న ఓఏ నంబరు.13/2021(ఎస్‌జడ్) తుది ఉత్తర్వులు జారీచేసింది. మూడు నెలల్లో చెల్లించాలని, లేని పక్షంలో 2020 డిసెంబరు 23 నుంచి నష్టపరిహారం చెల్లించాల్సి ఉంటుందని స్పష్టమైన ఆదేశాలు జారీచేసింది. ఎన్‌జీటీ తీర్పుకు లోబడి అపరాధ రుసుం రూ.5.20 కోట్లు గడువులోగా చెల్లించాలని. లేని పక్షంలో నష్టపరిహారం కూడా చెల్లించక తప్పదని, 57.6 ఎంఎల్‌డీ సామర్థ్యంలో మురుగు నీటి శుద్ధి కేంద్రాలు (ఎస్‌టీపీ) తక్షణమే పూర్తి చేసి మురుగునీరు శుద్ధి చేయాలని, 12 నెలల్లోగా ఈ పనులు పూర్తి చేయాలని విజయవాడకు చెందిన ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి (ఏపీ ఎసీబీ) సభ్య కార్యదర్శి గతనెల జూలై 23న కార్పొరేషన్ అధికారులకు నోటీసులు జారీచేశారు. ఆ దిశగా చర్యలు నామమాత్రంగా ఉన్నాయి. 13 ఎస్‌టీపీ ప్లాంట్‌లు నిర్మిస్తామని కర్నూలు కార్పొరేషన్ అధికారులు గ్రీన్ ట్రిబ్యునల్‌కు ఇచ్చిన అఫిడ విట్‌లో పేర్కొన్నట్లు తెలుస్తుంది. సకాలంలో అపరాధ రుసుం చెల్లించకపోవడంతో ప్రతి నెల ఒక్కో ఎస్‌టీపీకి రూ.5లక్షలు చొప్పున 13 ఎస్‌టీపీలకు రూ.65లక్షలు వరకు నష్టపరిహారం చెల్లించాల్సి వస్తుందని న్యాయ నిపుణులు పేర్కొంటున్నారు.


జోహరాపురం బిడ్జి దగ్గర తుంగభద్రలో హంద్రీ నది కలిసే ప్రదేశంలో నిర్మిస్తున్న 10 ఎంఎల్‌డీల శుద్ధి కేంద్రం చేరిన వరద నీరు

అప్పీల్‌కు వెళ్లాం

ఎస్‌టీపీ నిర్వహణలో నిర్లక్ష్యంపై రాతపూర్వకంగా సమాధానం ఇవ్వాలని ఎస్ఈ, డీఈఈ, ఏఈఈలకు మెమోలో జారీ చేశాం. మురుగునీరు తుంగభద్రలో కలసి నదీజలాలు కలుషితం అవుతాయని కేసు నమోదుచేసిన ఎన్‌జీటీ రూ.5.20 కోట్లు అపరాధ రుసుం చెల్లించాలని తీర్పు ఇచ్చింది. దీనిపై అప్పీల్‌కు వెళ్లాం. 50 ఎంఎల్‌డీ సామర్థ్యంతో ఎస్‌టీపీలు నిర్మించాల్సి ఉంది. ఉన్నవాటిని సక్రమంగా నిర్వహణ చేపట్టేందుకు చర్యలు తీసుకుంటాం.

● విశ్వనాథ్, కమిషనర్, నగరపాలక సంస్థ, కర్నూలు

ఎస్‌టీపీల నిర్మాణంలో జాప్యం.. కార్పొరేషన్‌కు శాపం

మురుగునీటి శుద్ధి కేంద్రాలు (ఎస్‌టీపీ) నిర్మాణంలో అంతులేని జాప్యం కర్నూలు కార్పొరేషన్‌కు శాపంగా మారింది. ఓల్డ్ పంప్‌హౌస్, సంకల్‌బాగ్, హంద్రీ నది దగ్గర ఏర్పాటుచేసిన మూడు ఎస్‌టీపీ ద్వారా 2.40ఎంఎల్‌డీల మురుగునీరు శుద్ధి చేయవచ్చు. అవి కూడా సక్రమంగా పని చేయడం లేదు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో రూ.9కోట్లతో తుంగభద్రలో హంద్రీ నది కలిసే జోహరాపురం బ్రిడ్జి వద్ద 10 ఎంఎల్‌డీలు, హంద్రీ నదిపై దేవనగర్ వద్ద 2 ఎంఎల్‌డీల సామర్థ్యంలో ఎస్‌టీపీల నిర్మాణం 2018లో చేపట్టారు. ఏళ్లు గడుస్తున్నా అసంపూర్తిగా ఉన్నాయి. గత వైసీపీ హయాంలో నిర్లక్ష్యం శాపంగా మారింది. మరో 35 ఎంఎల్‌డీ సామర్థ్యంలో రాంబోట్ల దేవాలయం సమీపంలో ఎస్‌టీపీలు నిర్మించాలని రూ.79 కోట్లతో పంపిన ప్రతిపాదనలు కార్యరూపం దాల్చలేదు.

ఇంజనీర్లకు నోటీసులు జారీ

ఎస్‌టీపీనిర్వహణలో నిర్లక్ష్యం, అసంపూర్తి పనులు చేయడంలో జాప్యంపై నగరపాలక సంస్థ ఎస్ఈ శేషసాయి, డీఈఈ జి. గంగాధర్, ఏఈఈ సీవీఆర్ వైష్ణవిలకు కమిషనర్ విశ్వనాథ్ ఆర్‌సీ నంబరు.543158/2025/సీ1 కింద మెమో జారీ చేశారు. గ్రీన్ ట్రిబ్యునల్ ఇచ్చిన గడువు డిసెంబరుతో ముగుస్తుంది. ప్రజారోగ్య (పబ్లిక్ హెల్త్) విభాగం సంకల్‌బాగ్ వద్ద 0.8ఎంఎల్‌డీ, జమ్మిచెట్టు వద్ద 0.8 ఎంఎల్‌డీ, తుంగభద్ర పాత పంప్ హౌస్ వద్ద 0.8 ఎంఎల్‌డీ సామర్థ్యంతో ఎస్‌టీపీలు నిర్మించి 2022లో కార్పొరేషన్‌కు అప్ప గించింది. సంకల్‌బాగ్ వద్ద ఉన్న ఎస్‌టీపీ తప్పా మిగిలిన రెండు ఎస్‌టీపీలు పని చేయడం లేదు. వాటిని వినియోగంలోకి తీసుకురావడానికి ఎందుకు చర్యలు తీసుకోలేదు..? గ్రీన్ ట్రిబ్యునల్ తుది ఉత్తర్వుల గడువు ముగుస్తుందని, ఆ తర్వాత భారీ జరిమానా చెల్లించిం చాల్సి వస్తుందనే విషయం కూడా తెలిసి ఎందుకు నిర్లక్ష్యంగా ఉన్నారు..? రాతపూర్వకంగా వివరణ కోరుతూ వారిని మెమో జారీ చేయడం కార్పొరేషన్‌లో చర్చగా మారింది.

శ్రీశైలానికి భారీ వరద


పదిగేట్ల ద్వారా దిగువకు నీటి విడుదల

నంద్యాల, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతాల నుంచి శ్రీశైలం జలాశయానికి వరద ప్రవాహం భారీగా కొనసాగుతోంది. దీంతో శ్రీశైలం జలాశయం 10 రేడియల్ క్రస్ట్ గేట్లను 18 అడుగుల మేర పైకి ఎత్తి స్పిల్‌వే ద్వారా 4,20,370 క్యూసెక్కులు, శ్రీశైలం కుడి, ఎడమగట్టు జలవిద్యుత్ కేంద్రాల్లో విద్యుత్ ఉత్పత్తి చేస్తూ 65,065 క్యూసెక్కుల నీటిని నాగార్జునసాగర్‌కు విడుదల చేస్తున్నారు. జూరాల, సుంకేసుల నుంచి 5,21601 క్యూసెక్కుల వరద శ్రీశైలం ప్రాజెక్టుకు చేరుతోంది. గురువారం సాయంత్రం 6 గంటల సమయానికి శ్రీశైలం జలాశయం నీటిమట్టం 881.90 అడుగులు, నీటినిల్వ 198.3623 టీఎంసీలుగా నమోదైంది.

బహుముఖ ప్రజ్ఞాశాలి ప్రకాశం పంతులు

- క్లస్టర్ యూనివర్సిటీ ఇన్‌చార్జి వీసీ వెంకట బసవరావు
- క్విజ్ పోటీ విజేతల జాబితా విడుదల


క్విజ్ విజేతల జాబితా విడుదల చేస్తున్న ఇన్‌చార్జి ఉపకులపతి, రిజిస్ట్రార్

కర్నూలు అర్బన్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): ప్రకాశం పంతులు స్వాతంత్ర్య సమరయోధుడే కాదు బహుముఖ ప్రజ్ఞాశాలి అని క్లస్టర్ యూనివర్సిటీ ఇన్‌చార్జి వీసీ వెంకట బసవరావు అన్నారు. గురువారం క్లస్టర్ యూనివర్సిటీలో ఈనెల 23న జరిగే ప్రకాశం పంతులు 153వ జయంతి వేడుకల సందర్భంగా రిజిస్ట్రార్ జీ. శ్రీనివాసులుతో కలిసి క్విజ్ పోటీల్లో విజేతల జాబితాను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి వీసీ మాట్లాడుతూ టంగుటూరి ప్రకాశం పంతులు సీఎంగా ప్రమాణ స్వీకారం కర్నూలు జిల్లాలోనే చేయడం ఎంతో గర్వకారణమన్నారు. రిజిస్ట్రార్ జీ. శ్రీనివాసులు మాట్లాడుతూ దేశానికి ఎనలేని సేవలు అందించారని కొనియాడారు. గాడచర్ల ఫౌండేషన్ అధ్యక్షులు కల్కూర చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రకాశం పంతులు బాల్యం నుంచే పోరాట పటిమ ఉన్న వ్యక్తి అని, పేదలకు ఉచితంగా న్యాయ సలహాలు ఇచ్చే వారని తెలిపారు. ఈ క్విజ్ పోటీలకు కర్నూల్లోని వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులైన విజేతలకు బహుమతులు, జ్ఞాపికలు, సర్టిఫికెట్లు ఈనెల 23న కేవీఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ బాలుర డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ఇందిరా శాంతి, కేవీఆర్ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ కే. వెంకటరెడ్డి, వైస్‌ప్రిన్సిపల్ బీఆర్ ప్రసాదరెడ్డి, మానవ వనరుల పరిశోధనా కేంద్రం వ్యవస్థాపకులు మన్సూర్ రమహమాన్, క్లస్టర్ వర్శిటీ డీన్‌లు అక్తర్ భాను, నాగరాజు శెట్టి, మహమ్మద్ వాహీద్, అధ్యాపకులు షామీద, ఎల్లాకృష్ణ, జయలక్ష్మి, రాధా రమణి, డి. పార్వతి తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తులు

కర్నూలు ఎడ్యుకేషన్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఐటీఐలలో మిగిలిన సీట్ల ఖాళీల భర్తీ చేయుటకు మూడో విడత ప్రవేశాలకోసం విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వాని స్తున్నట్లు ప్రభుత్వ జిల్లాస్థాయి శిక్షణ సంస్థ సహాయ సంచాలకులు ఆర్.కృష్ణమోహన్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. దరఖాస్తు చేసుకోవడానికి ఈ నెల 26వ తేదీ ఆఖరి గడువు అన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్స్ తీసు కెళ్లి వెరిఫికేషన్ చేయించుకున్న వారు అర్హులన్నారు. 29వ తేదీన ఉదయం 10.30 గంటలకు కర్నూలు ఐటీఐలో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కర్నూలు డీఎల్‌డీసీలో టెక్నాలజీ టైలరింగ్, ఎలక్ట్రీషన్, ఫిట్టర్ వంటి ఖాళీలు భర్తీ చేస్తామని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ప్రమాదకర కుంట


పాఠశాల ఆవరణలో తవ్విన కుంట

పాఠశాలల్లో వైసీపీ హయాంలో 'నాడు-నేడు' పనుల కింద ఓ పెద్ద కుంటను తవ్వారు. ఈకుంటతో ప్రమాదం పొంచి ఉంది. హాలహర్వి మండలంలోని గూళ్యంలో పాఠశాలలో సుమారు వెయ్యి మంది విద్యార్థులు చదువుతున్నారు. ఆ పాఠశాల ఆవరణలోనే కుంట ఉంది. ఆడుకునేందుకు పిల్లలు అటుగా వెళ్తుంటారు. ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని తల్లిదండ్రులు భయాందోళనకు గురి అవుతున్నారు. పాఠశాల ఆవరణలో తవ్విన కుంటను వెంటనే పూడ్చాలని పలువురు కోరుతున్నారు.

● హాలహర్వి, ఆంధ్రజ్యోతి

కమనీయం.. ఉమామహేశ్వరస్వామి కల్యాణం


యాగంటిలో ఉమామహేశ్వరస్వామి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

బనగానపల్లె, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రముఖ శైవ క్షేత్రమైన యాగంటి క్షేత్రంలో ఉమామహేశ్వరస్వామి కల్యాణం గురువారం అంగరంగ వైభవనంగా నిర్వహించారు. ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో ఉమామహేశ్వరస్వామి కల్యాణోత్సవాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. మాస శివరాత్రి సందర్భంగా ఈ వేడుకలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ ఈవో పాండురంగారెడ్డి, కుమార స్వామిరెడ్డి, దంపతులు, మౌలీశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేపై తప్పుడు ప్రచారాలు తగవు

- సున్నిపెంట టీడీపీ నాయకులు


సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

నంద్యాల, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ఫారెస్టు అధికారులపై శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి దాడి చేశారని జరుగుతున్న తప్పుడు ప్రచారం మానుకోవాలని టీడీపీ నాయకులు అన్నారు. గురువారం సున్నిపెంట టీడీపీ కార్యాలయంలో స్థానిక టీడీపీ నాయకులు సుబ్బారెడ్డి, ఉమామహేశ్వరరావు, మైనార్టీ సెల్ అధ్యక్షులు మహ్మద్‌హుస్సేన్, గ్రామ కమిటీ అధ్యక్షులు సుభాన్‌లు విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫారెస్టు అధికారులు వాస్తవాలను వక్రీకరిస్తున్నారన్నారు. శిఖరం చెక్‌పోస్టు వద్ద ఫారెస్టు సిబ్బంది, యాత్రికుల మధ్య జరుగుతున్న గొడవను చూసి అటుగా వెళ్తున్న ఎమ్మెల్యే వాహనం ఆపి ఇరువురికి సర్దిచెప్పి పంపించే ప్రయత్నం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు అడుసుమల్లి సుబ్బారావు, నాగేల్ల నాగేశ్వరరావు, నజీర్, షైలా శ్రీను, సామేల్, పోలయ్య జావిద్, మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు.



ఆశలు ఇక సమాధికే..
సాయి కిరణ్ మృతదేహానికి అంత్యక్రియలు

చిగిలి గుండె పగిలి

(5వ పేజీ తరువాయి)

యథావిధిగా పాఠశాలకు వెళ్లి సాయంత్రం మూడున్నర గంటలకు పాఠశాల వదలడంతో ఇంటికి వెళ్లిపోయారు. తిరిగి స్నేహితులంతా ఒక్కటై గ్రామానికి కిలోమీటరు దూరంలో ఉన్న నీటికుంటలో ఈతకొడుతూ ప్రమాదవశాత్తు మృత్యువాత పడ్డారు. ఈ విషాద ఘటనతో రాష్ట్ర ప్రభుత్వంతో పాటు నాయకులు, పాలకులు, అధికారులు స్పందించి గ్రామానికి చేరుకుని బాధితా కుటుంబాలను పరామర్శించి ధైర్యం చెప్పారు.

దేవుడా.. ఎంతపని చేశావయ్యా!

'ఒక్కగానొక్క కొడుకు ఎంతో గారాబంగా చూసుకున్నాము. బాగా చదివించి ప్రయోజకుడిని చేయాలనుకున్నాం. ఇంతలోనే మా కుటుంబాలనే నీట ముంచావు కదా దేవుడా. చివరకు మా కుటుంబాలకు వారసత్వాలు లేకుండా చేశావు' అంటూ భీమేష్, సాయికిరణ్, మహబూబ్‌బాషా తల్లిదండ్రులు కన్నీటి పర్యంతమయ్యారు. ఏ తప్పు చేశామని ఇంత శిక్ష వేశావయ్యా.. మగదిక్కు లేకుండా చేశావు స్వామీ అంటూ వారు ఆ బిడ్డలను పట్టుకుని బోరుమన్నారు.

అధికారులు, నేతల పరామర్శ

ఆరుగురు విద్యార్థులు మృతి చెందిన విషయం తెలిసి జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్‌పాల్, మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ, వాల్మీకి కార్పొరేషన్ ఛైర్మన్ కప్పట్రాళ్ల బొజ్జమ్మ, ఆలూరు టీడీపీ నేత వీరభద్రగౌడ్, ఆదోని జనసేన నేత మల్లప్ప, వైసీపీ జిల్లా మహిళా నాయకురాలు శశికళ తదితరులు చిన్నారుల కుటుంబాల వద్దకు వెళ్లి, మృతులకు పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబాలను ఓదార్చారు. టీడీపీ ఆలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి వీరభద్రగౌడ్, కోట్ల సుజాతమ్మలు ఒక్కొక్క కుటుంబానికి విడివిడిగా రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు.



సాయీ.. మళ్లీ ఎప్పుడు వస్తావ్ రా..
కన్నీటి పర్యంతమవుతున్న తల్లి మమత



రేపటి నుంచి మీరు రారా..?
చిన్నారులు చదివే పాఠశాల ఇది..
(ఒకేరోజు ఆరుగురు విద్యార్థులు చనిపోవడంతో సంతాపసూచికంగా పాఠశాలకు సెలవు ఇచ్చారు)

కుటుంబాలను మింగిన నీటికుంట

రాజకీయ నాయకుల స్వార్థం కోసం తవ్విన నీటికుంట ఒకేసారి ఆరు కుటుంబాలను మింగేసిందని చిన్నారుల తల్లిదండ్రులు బోరుమన్నారు. ఇలాంటి సంఘటన శత్రువులకైనా రాకూడదని గుండెలవిసేలా విలపించారు. 'నాన్న లేరా... బుజ్జికొండ ఒక్కసారి చూడు రా... పెద్దపెద్ద రాజకీయ నాయకులు వచ్చారురా.. నీకు పూలదండలు తెచ్చారు లేరా... మీసారు వాళ్లు వచ్చారు. లే కన్నా... లే... చుట్టాలు వచ్చారు.. ఒక్కసారి చూడు నాన్న' అంటూ ఆ చిన్నారుల తల్లిదండ్రులు గుండె పగిలేలా రోదించిన తీరు కలచివేసింది.



ఇక సెలవ్.. చిన్నారులు కిన్నెరసాయి, శశికుమార్‌ల అంతిమయాత్ర

ఆ ముగ్గురూ ఒకే చోట..



మృత్యువులోనూ కలిసే..
అన్నదమ్ములను సమాధి చేస్తున్న బంధువులు

కిన్నెరసాయి, శశికుమార్ అన్నదమ్ములే కాదు. ఒకే వయసుతో ఉన్న స్నేహితులు కూడా. వీరికి సాయి కిరణ్ తోడుగా మంచి స్నేహితులు. రోజూ ఒకరినొకరు ప్రేమగా తిట్టుకుంటూ, మళ్లీ ఒక్కటవుతూ స్నేహబంధాన్ని బలపరుచుకున్నారే తప్పా ఏనాడూ విడిగా వెళ్లింది లేదు. అందరూ కలసి స్కూల్‌కు వెళ్లేవారు, వచ్చేవారు. అన్నింటా కలసిమెలసి ఉన్న ఆముగ్గురూ మృత్యువులోనూ ఒక్కటిగానే వెళ్లారు. ఆ ముగ్గురిని కుటుంబ సభ్యులు ఒకే చోట ఖననం చేశారు. గ్రామ శివారులోని మరంకొండ శ్మశాన వాటికలో ఒకేచోట అంత్యక్రియలు నిర్వహించారు. కడసారిచూపు కావడంతో గ్రామ ప్రజలంతా కుల, మతాలకు అతీతంగా.. మూఢ నమ్మకాలను పక్కనపెట్టి 'అయ్యో పాపం' అంటూ చిన్నారులను చూసేందుకు తరలివచ్చారు.



దుఃఖం భరించలేను తల్లీ..

అంతిమయాత్రలో ఆర్తనాదాలు

గురువారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఆరుగురు చిన్నారుల అంతిమయాత్ర ప్రారంభమైంది. ఈ అంతిమయాత్రలో ఆయా ప్రాంతాల్లో ఉన్న బంధువర్గం, స్నేహితులు, వివిధ పార్టీల రాజకీయ నాయకులు, గ్రామస్థులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఒకేసారి ఆరుగురు చిన్నారుల అంతిమయాత్ర గ్రామంలో ప్రారంభం కావడంతో ప్రతి ఒక్కరూ బరువెక్కిన హృదయంతో శ్మశానం వైపు అడుగులు వేశారు. ఊరు ఊరంతా పనులన్నీ ఆపేసి అంతిమయాత్రలో పాల్గొన్నారు. ఎటు చూసినా విషాదఛాయలు అలుముకున్నాయి. ఎవరిని కదిలించినా వారు కన్నీటిపర్యంతమవుతూనే కనిపించారు. పసికందులు కాకుండా మమ్మల్ని అయినా తీసుకెళ్లకూడదా దేవుడా ఎంత పనిచేశావు నువ్వు అంటూ వృద్ధులు సైతం కంటతడి పెట్టారు.



అన్నా మేమున్నాం, ఏడవవద్దు..
పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ



అంతులేని విషాదం..
మహబూబ్‌బాషా డోలిని మోస్తున్న బంధువులు



అప్పుడే నూరేళ్లు నిండాయా?
సాయికిరణ్ మృతదేహంతో బంధువులు

ఎస్సార్బీసీలో యువకుడి గల్లంతు

పాణ్యం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): పాణ్యం సమీపంలోని ఎస్సార్బీ(శ్రీశైలం రైట్ బ్రాంచ్ కెనాల్)లో పడి ఓ యువకుడు గల్లంతు అయ్యాడు. ఈ ఘటన గురువారం సాయంత్రం చోటుచేసుకున్నట్లు ఏఎస్ఐ రఫీక్ తెలిపారు. వివరాలు.. బేతంచర్ల మండలం గొర్విమానుకొండకి చెందిన జగదీశ్ (22) తన బంధువులతో కలిసి నంద్యాల నుంచి గ్రామానికి వస్తున్నాడు. పాణ్యం వద్ద ఎస్సార్బీసీలో స్నానం చేయడానికి మరో యువకుడితో పాటు కెనాల్‌లో దిగాడు. నీటి ప్రవాహానికి ఇద్దరు కాలుజారి పడిపోయారు. ఈ ఘటనలో ఒక యువకుడిని సమీపంలోని కొందరు వ్యక్తులు తాడు వేసి కాపాడారు. జగదీశ్ నీటి ఉధృతికి కొట్టుకుపోయాడు. యువకుడి జాడకోసం పోలీసులు గాలిస్తున్నారు.

గొలుసు దొంగ హల్‌చల్?



కర్నూలు క్రైం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): తాలుకా పోలీస్ స్టేషన్ పరిధిలో బాలాజీ నగర్‌లో గొలుసు దొంగ హల్‌చల్ చేశాడు. మంజుల అనే మహిళ మెడలో నుంచి గొలుసు తెంపుకుని ఉడాయించినట్లుగా సమాచారం. తన ఇంటి ముందు ఉండగా.. ఓ ఆగంతకుడు వచ్చి తనను లోపలికి తోసేసి ఓ స్టోర్ రూములో కట్టేసి మెడలో గొలుసు తెంపుకుని ఉడాయించినట్లుగా బాధిత మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసింది. సాయంత్రం ఇంటికి వచ్చిన భర్త నరసింహులు విడిపించాడని, ఈ ఘటనపై పోలీసులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. సంఘటనా స్థలానికి చేరుకుని విచారిస్తున్నట్లు సీఐ శ్రీధర్ తెలిపారు.

కుక్కదాడి.. నలుగురికి గాయాలు

చాగలమర్రి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని డి.వనిపెంట గ్రామంలో గురువారం కుక్క దాడిలో నలుగురు గాయపడ్డారు. గ్రామంలోని ప్రణయ్, రాఘవ, బాలయ్య, ప్రనితలకు రక్త గాయాలు కావడంత చికిత్స నిమిత్తం ఆళ్లగడ్డ వైద్యశాలకు తరలివెళ్లారు. కుక్క స్వైరవిహారం చేసి నలుగురిని గాయపరచడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. గ్రామంలో కుక్కలు అధికంగా సంచరిస్తున్నాయని, వాటి నుంచి కాపాడాలని అధికారులకు గ్రామస్థులు కోరారు.

మొబైల్ క్యాంటీన్‌లో గ్యాస్ లీక్

- ఇరువురికి గాయాలు, కర్నూలుకు తరలింపు

వెల్దుర్తి, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై మొబైల్ క్యాంటీన్‌లో గ్యాస్ లీకయి మంటలు చెలరేగి, ఇద్దరు గాయపడ్డారు. వివరాల మేరకు.. వెల్దుర్తికి చెందిన దంపతులు ఏసురాజు, సుకన్య వెల్దుర్తి సమీపంలోని జాతీయ రహదారి -44 ఈద్గా వద్ద మొబైల్ క్యాంటీన్ నిర్వహిస్తున్నారు. గురువారం ఉదయం పనిచేస్తుండగా ఒక్కసారిగా గ్యాస్ లీకయి మంటలు చెలరేగి నిర్వాహకులు ఏసురాజు, సుకన్య గాయపడ్డారు. స్థానికులు అంబులెన్స్‌లో వెల్దుర్తి సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూలు సర్వజన వైద్యశాలకు తరలించారు. వారి ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు.

రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరికి గాయాలు



సిమెంట్ కంటైనర్ ఢీకొని నుజ్జునుజ్జయిన ట్రాక్టర్

కొలిమిగుండ్ల, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మండలలో రెండు చోట్ల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరికి గాయాలయ్యాయి. వివరాలివీ.. కొలిమిగుండ్ల అంబేడ్కర్ సర్కిల్ సమీపంలో ఎన్‌హెచ్-544డి రహదారిపై గురువారం సాయంత్రం రోడ్డు ప్రమాదం జరిగింది. కొలిమిగుండ్ల నుంచి ఇటిక్యాలకు తిరిగి వెళ్తున్న ట్రాక్టర్‌ను మలుపు వద్ద ఎదురుగా వస్తున్న సిమెంట్ కంటైనర్ ఢీకొట్టడంతో ట్రాక్టర్ ఇంజన్ నుజ్జునుజ్జయింది. ఈప్రమాదంలో ఇటిక్యాలకు చెందిన డ్రైవర్ వెంకటేశ్వర్లుకు తీవ్రగాయాలయ్యాయి. 108 అంబులెన్స్‌లో తాడిపత్రికి తరలించారు. దీంతో ట్రాఫిక్ నిలిచిపోగా, పోలీసులు రాకపోకలను పునరుద్ధరించారు. అలాగే కొలిమిగుండ్ల తహసీల్దార్ కార్యాలయం వద్ద ఓ వాహనం, బైకు ఢీకొన్న ఘటనలో భాస్కర్ అనే యువకుడికి గాయాలయ్యాయి. బైకుపై మోడల్‌స్కూల్ వైపు నుంచి వస్తున్న భాస్కర్‌ను వాహనం ఢీకొట్టింది.

సీసీఐ సీఐపై కేసు

- భార్య ఉండగానే రెండో పెళ్లి
- ఫిర్యాదు చేయడానికి వచ్చిన మహిళతో వివాహం
- రెండో భార్య మొదటి భర్త పవన్‌కుమార్ ఫిర్యాదు
- కేసు నమోదు చేసిన మదనపల్లి పోలీసులు



సురేశ్ కుమార్

నంద్యాల టౌన్, ఆగస్టు21(ఆంధ్రజ్యోతి): నంద్యాల సీసీఎస్‌లో పనిచేస్తున్న సీఐ సురేశ్ కుమార్‌పై భార్య ఉండగానే రెండో పెళ్లి చేసుకోవడంపై మదనపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు, బాధితుడు పవన్‌కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పవన్ కుమార్‌కు 2018లో కలికిరికి చెందిన సరితతో పెళ్లి జరిగింది. కొన్ని సమస్యల వల్ల విడిపోయి స్థానికంగా సరిత ఫిర్యాదు చేసింది. 2021లో సరిత మదనపల్లి డీఎస్పీ కార్యాలయానికి కేసు పని మీద వచ్చింది. అదే సమయంలో మొలకల చెరవులో సీఐగా పనిచేస్తున్న సురేశ్‌కుమార్ డీఎస్పీ కార్యాల యంలో ఆమెను పరిచయం చేసుకున్నాడు. భార్య ఉండగానే నెలలోనే సరితను రెండో పెళ్లి చేసుకు న్నాడు. ఇటీవల ఆమె ఒక బిడ్డకు జన్మనిచ్చింది. సరిత మొదటి భర్త అయిన పవన్‌కుమార్ దీనిపై ఎన్నో సార్లు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అయినా వారు పట్టించుకోలేదు. డీజీపీ కార్యాలయంలో ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయింది. దీంతో కోర్టును ఆశ్రయించి ఐదు సార్లు విన్నవించుకున్నాడు. కేవలం చిన్న కేసు కట్టి వదిలేశారు. బాధితుడు ఈ సారి ఏకంగా ప్రధానమంత్రి కార్యాలయానికి ఫిర్యాదు చేశాడు. దీంతో స్పందించిన పోలీసుశాఖ సీఐపై విచారణకు ఆదేశించింది. దీంతో ఆ సీఐ గత నెల రోజులకు పైగా ఆరోగ్యం బాగాలేదని సెలవు పెట్టి ఎక్కడికో వెళ్లిపోయాడు.

సీఐ క్యాస్ట్ సర్టిఫికెట్‌పై కూడా విచారణ

సీఐ సురేశ్‌కుమార్ క్యాస్ట్ సర్టిఫికెట్‌పై కడప జిల్లా రెవెన్యూ శాఖ విచారణ చేస్తోంది. సీఐ తండ్రి పేరు సుబ్బారెడ్డి, తల్లి నరస సుబ్బమ్మ. వీరిద్దరు కులాంతర వివాహం చేసుకున్నారు. అయితే తల్లి క్యాస్ట్ మీద సర్టిఫికెట్లు తీసుకుని సీఐ ఉద్యోగంలో చేరాడు. దీనిపై బాధితుడు ఇటీవల పీఎంవోకు ఫిర్యాదు చేయగా విచారణ చేశారు. ప్రతిచోట అతను ఓసీ అని రాసుకుని కేవలం ఉద్యోగం విషయంలో మాత్రమే వేరే క్యాస్ట్(ఎస్సీ) అని రాసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇదే క్రమంలో తండ్రి పేరు కూడా సుబ్బారెడ్డి కాస్త సుబ్బయ్యగా మార్చి సర్టిఫికెట్లలోనూ అవకతవకలకు పాల్పడి ఉద్యో గంలో చేరినట్లు ఆరోపణలున్నాయి. ఇటీవల హైకోర్టుకు హాజరైన సమయంలో కూడా తండ్రి పేరు సుబ్బారెడ్డిగా రాశాడు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు అతడిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బాధితుడు కోరుతున్నాడు.

వ్యక్తి ఆత్మహత్య



ఆత్మహత్య చేసుకున్న నాగేంద్రసింగ్

ఆత్మకూరురూరల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు పట్టణంలోని తోటగేరిలో నాగేంద్ర సింగ్ (42) అనే వ్యక్తి ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన గురువారం రాత్రి ఆత్మకూరులో చోటు చేసుకుంది. ఎస్ఐ నారాయణ రెడ్డి వివరాల మేరకు... ఆత్మకూరు పట్టణానికి చెందిన నాగేంద్ర సింగ్ ఓ కిరాణాదుకాణంలో గుమాస్తాగా పని చేస్తున్నాడు. ఇటీవల మద్యానికి బానిసైన నాగేంద్రసింగ్ తరచూ కడుపు నొప్పితో బాధ పడుతుండేవాడు. కడుపునొప్పి భరించలేక ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికుల సమా చారం మేరకు ఎస్ఐ నారాయణరెడ్డి సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రిటైర్డ్ ఉద్యోగి ప్రాణాలు కాపాడిన పోలీస్

- అత్యవసర పరిస్థితిలో సీపీఆర్ చేసిన హెడ్ కానిస్టేబుల్



సీపీఆర్ చేస్తున్న కోదండరామిరెడ్డి

ఎమ్మిగనూరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): టిఫిన్ సెంటర్‌లో ఓ రిటైర్డ్ ఉద్యోగి ఆకస్మాత్తుగా కుప్పకూలి పడిపోగా అదే సమయంలో అక్కడికి వచ్చిన నందవరం హెడ్ కానిస్టేబుల్ కొండదరామిరెడ్డి సీపీఆర్ చేసి ప్రాణాలు కాపాడిన సంఘటన గురువారం ఎమ్మిగనూరులో చోటుచేసుకుంది. పట్టణంలోని ఎస్సీ కాలనీలో నివాసం ఉంటున్న రిటైర్డ్ ఉద్యోగి రాజశేఖర్ అల్పాహారం చేసేందుకు పెద్దబావి ప్రాంతంలో ఉన్న అమరావతి టిఫిన్ సెంటర్‌కు వెళ్లాడు. ఈ క్రమంలో ఉన్నట్టుండి స్పృహ తప్పి కుప్పకూలాడు. మూర్ఛవచ్చిందని స్థానికులు చేతిలో తాళాలు పట్టించారు. ఇదే సమయంలో టిఫిన్ సెంటర్‌కు వచ్చిన కోదండరామిరెడ్డి అందరిని పక్కకు జరిపి బాధితుడి ఛాతీపై 10 నిమిషాలు సీపీఆర్ చేశాడు. దీంతో రాజశేఖర్ లేచి కూర్చున్నాడు. తేరుకున్నాక మరో సారి కళ్లుతిరిగి కిందకు పడిపోయాడు. దీంతో గుండెపోటు అని గుర్తించిన ఏఎస్ఐ వెంటనే అంబులెన్స్‌కు ఫోన్‌చేసి మరోసారి సీపీఆర్ చేశాడు. బాధితుడు స్పృహలోకి రావటంతో అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు ఆసుపత్రికి చేరుకుని వైద్యుల సూచనమేరకు మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించారు. ప్రస్తుతం రాజశేఖర్ ఆరోగ్యం నిలకడగా ఉంది. కాగా సకాలంలో సీపీఆర్ చేసిన నందవరంహెడ్ కానిస్టేబుల్‌ను పలువురు అభినందించారు.

ఘనంగా పెద్దరాజు స్వామి ఉరుసు

- మేళతాళాలతో గంధం ఊరేగింపు
- ఆకట్టుకున్న ఫకీరుల విన్యాసాలు
- తరలివచ్చిన భక్తులు



ఊరేగింపుగా వస్తున్న దర్గా పీఠాధిపతి గురు సయ్యద్ అక్బర్‌బాషా ఖాద్రి

బేతంచెర్ల, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గూటుపల్లెలో వెలసిన సయ్యద్ షా అబ్దుల్ రెహిమాన్ ఇద్రుస్‌బాషా ఖాద్రి ఉరఫ్ పెద్దరాజు స్వామి ఉరుసు గురువారం ఘనంగా నిర్వహించారు. దర్గా పీఠాధిపతి సయ్యద్ అక్బర్ బాషా ఖాద్రి ఇంటి నుంచి బుధవారం తెల్లవారుజామున గంధం సయ్యద్ అక్బర్‌బాషా కాద్రి గుర్రంపై గ్రామ వీధుల గుండా మేళతాళాలతో ఫకీరుల విన్యాసాలతో ఊరేగింపు వస్తూ గంధం దర్గాకు చేరుకుంది. గంధం పెద్దరాజు స్వామికి సమర్పించి ఫతేహాల్ చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఫకీరులు విన్యాసాలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ ఉరుసుకు మహారాష్ట్ర నుంచి భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఎస్ఐ రమేష్‌బాబు గట్టి పోలీసు బందోబస్తు నిర్వహించారు.

ఎమ్మెల్యే కోట్ల, కేఈ ప్రత్యేక ప్రార్థనలు

గూటుపల్లె పెద్దరాజు స్వామివారిని దర్గాను ఎమ్మెల్యేలు కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి, కేఈ ప్రతాప్ రెడ్డి దర్శించుకున్నారు. దర్గా పీఠాధిపతి అక్బర్ బాషా ఖాద్రి ఎమ్మెల్యేతో ప్రత్యేక ప్రార్థనలు చేయించారు. ఎమ్మెల్యే వెంట టీడీపీ మండల కన్వీనర్ ఎల్ల నాగయ్య, గ్రామ నాయకులు ముల్లా, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు



ఫకీరుల విన్యాసాలు



దర్గాను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే కోట్ల

అభివృద్ధిని అడ్డుకుంటే సహించం

కేడీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి



మాట్లాడుతున్న విష్ణువర్ధన్‌రెడ్డి

కోడుమూరు రూరల్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): అభివృద్ధిని అడ్డుకుంటే సహించమని కేడీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. అమడగుంట్ల గ్రామంలో నూతనంగా నిర్మించిన సచివాలయం, రైతుసేవా కేంద్రాన్ని గురువారం ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరితో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం ఆర్ఎస్‌కే వద్ద మొక్కలు నాటి నీరు పోశారు. విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం చంద్రబాబు స్ఫూర్తితో నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నామని, నియోజకవర్గంలో అరాచకశక్తుల ఆటలు సాగవని తేల్చి చెప్పారు. ఎమ్మెల్యే దస్తగిరి మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్న సీఎం చంద్రబాబుకు అండగా ఉండాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ నాగరాజు, ఎంపీడీవో రాముడు, టీడీపీ మండల కన్వీనర్ రామక్రిష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి రాజు, నాయకులు రమేష్, సురేష్ తులసిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, శంకరరెడ్డి, మధునాయుడు, రవికిషోర్, రంగస్వామి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఎంఎల్ఎస్ పాయింట్‌ను తనిఖీ చేసిన జేసీ



ఎంఎల్ఎస్ పాయింట్‌ను తనిఖీ చేస్తున్న జాయింట్ కలెక్టర్ నవ్య

కర్నూలు కలెక్టరేట్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): నగరంలోని పౌర సరఫరాల సంస్థ ఎంఎల్ఎస్ పాయింట్‌ను గురువారం జాయింట్ కలెక్టర్ బి.నవ్య తనిఖీ చేశారు. అక్కడ పని చేస్తున్న హమాలీలకు ప్రతి రెండేళ్లకు ఒకసారి ఇచ్చే యూనిఫాం దుస్తులను వారికి అందజేశారు. సెప్టెంబరు నెలలో కేటాయించిన సరుకులను 25లోపు రేషన్ షాపులకు సరఫరా చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో పౌరసరఫరాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పదోన్నతులపై హర్షం

కర్నూలు కలెక్టరేట్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లాలో 120 మంది గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శులకు గ్రేడ్-4 పంచాయతీ కార్యదర్శులుగా పదోన్నతి కల్పించడంపై నవీన పంచాయతీ కార్యదర్శుల సంఘం హర్షం వ్యక్తం చేసింది. గురువారం విలేకరుల సమావేశంలో ఆ సంఘం కన్వీనర్ గిరి శ్రీకాంత్ మాట్లాడుతూ గత ఐదేళ్లుగా ఎలాంటి పదోన్నతులకు నోచుకోకుండా స్తబ్దుగా ఉన్న పంచాయతీ కార్యదర్శుల జీవితాల్లో వెలుగులు ప్రసరించాయనీ అన్నారు. ఈసందర్భంగా సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌లకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు టీఎం నరేష్, మనో హర్, రవికుమార్, రాముడు, సతీష్, రాము పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి: సీపీఎం

కర్నూలు న్యూసిటీ, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): అధిక వర్షాలతో నష్టపోయిన రైతులకు పంట నష్టపరిహారం ఇచ్చి ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ డిమాండ్ చేశారు. గురువారం సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో వర్షాలతో నష్టపో యిన పంటలను సీపీఎం ప్రతినిధి బృందం పరిశీలించిదన్నారు. సుమారు 25 వేల ఎకరాల్లో పంట దెబ్బతిందన్నారరు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి వర్గసభ్యుడు పీఎస్.రాధాకృష్ణ, టి.రాముడు పాల్గొన్నారు.

162 దివ్యాంగుల పింఛన్లు రద్దు

ఓర్వకల్లు, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): సెప్టెంబరు నెల నుంచి అనర్హులైన 162 మందికి దివ్యాంగులకు పింఛన్లు నిలిపివేస్తున్నట్లు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని ఓర్వకల్లు ఎంపీడీవో శ్రీనివాసులు తెలిపారు. గురువారం ఆయన విలేక రులతో మాట్లాడుతూ దివ్యాంగ పింఛన్ల లబ్ధిదారుల వైకల్యంపై ప్రభుత్వ ఆసు పత్రి వైద్యులతో విచారించి కొత్తగా సర్టిఫికెట్లు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చిందన్నారు. ఈ మేరకు నిర్వహించిన వైద్య పరీక్షల్లో 40 శాతం తక్కువ వైక ల్యం ఉండి పింఛన్ పొందుతున్న మండలంలో 162 మందికి పింఛన్లు ప్రభుత్వం రద్దు చేసినట్లు ఎంపీడీవో తెలిపారు.

పింఛన్ల తొలగింపు అన్యాయం

కర్నూలు న్యూసిటీ, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల పింఛన్లను ప్రభుత్వం తొలగించడం అన్యాయమని సంఘం నాయకులు అన్నారు. గురువారం కేకే భవన్‌లో వికలాంగుల హక్కుల జాతీయ వేదిక అధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమా వేశం నిర్వహించారు. ఎన్‌పీఆర్‌డీ జిల్లా అధ్యక్షురాలు రాజాముని‌మ్మ అధ్యక్షతన జరిగిన సమావేశంలో కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆనంద్‌బాబు, ఎన్‌పీఆర్‌డీ జిల్లా కార్యదర్శి గోపాల్ మాట్లాడుతూ విచారణ పేరుతో ఏరివేతకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. తప్పుడు సర్టిఫికెట్లు పొందిన వాళ్లను తీసి వేస్తే మాకు ఏమి ఇబ్బంది లేదన్నారు. కానీ ప్రభుత్వం ఎలాంటి విచారణ లేకుండానే 90 శాతం వికలాంగత్వం కలిగిన వాళ్లకు సైతం 40 శాతం ఉన్నట్లు సర్టిఫికెట్ జారీ చేయడమేమిటని ప్రశ్నించారు. సమావేశంలో ఉపాధ్యక్షులు రాధ, దివ్యాంగు సాధికార ఫోరం అధ్యక్షుడు నాగరాజు, కార్యదర్శి శివశంకర్, ఉపాధ్యక్షుడు వెంకటేష్ పాల్గొన్నారు.

ధరలు తెలిసేదేలా?

- అంగళ్ల వద్ద కనిపించని సమాచార బోర్డులు
- ఇబ్బందులు పడుతున్న రైతులు
- పట్టించుకోని అధికారులు
- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వ్యాపారులు

కర్నూలు అగ్రికల్చర్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): మార్కెట్లో ఏదైనా వస్తువు కొనాలంటే దాని ధర తెలియాల్సిందే. దీని కోసం ఎక్కడైనా సమాచార బోర్డులు పెట్టడం పరిపాటి. జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కార్యాలయానికి కూతవేటు దూరంలో ఉన్న కొత్తబస్టాండు వద్ద ఎరువులు, క్రిమిసంహారక మందులు, విత్తనాలు విక్రయించే దుకాణాలు పదుల సంఖ్యలో ఉన్నాయి. ఈ షాపుల్లో ఏ ఎరువు ధర ఎంత ఉందో రైతులకు తెలిసేలా సమాచార బోర్డులు పెట్టకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఈ విషయంపై వ్యవసాయాధికారులను ప్రశ్నిస్తే తాము రైతులకు తెలిసేలా అంగళ్ల వద్ద సమాచారబోర్డులు ఏర్పాటు చేయాలని, తమ ఫోన్ నెంబర్లను కనిపించేలా సమాచార బోర్డులపై రైతుల కోసం నమోదు చేయాలని నోటీసులు జారీచేశామని చెప్పి అంతటితో తమ బాధ్యత తీరిపోయినట్లు చేతులెత్తేస్తున్నారు. ప్రస్తుతం యూరియా, డీఏపీ తదితర ఎరువులు రైతులకు అందుబాటులో ఉండటం లేదు. కొంతమంది డీలర్లు సమాచార బోర్డులను అలంకార ప్రాయంగా అంగళ్లముందు ఏర్పాటు చేసినా వాటిపై క్రిమిసంహారక మందుల ధరలు గానీ, ఎంత పరిమాణం లో ఏయే మందులు అందుబాటులో ఉన్నాయో తెలిపే వివరాలు గానీ బోర్డులపై కనిపించడం లేదు. వ్యవసాయాధికారులు, వారి సిబ్బంది కేవ లం తమకు అత్యవసరంగా పనికొచ్చే సమయంలోనే డీలర్ల వద్దకు వచ్చి పనులను చక్కదిద్దుకుని వెళ్తున్నారు. సమాచార బోర్డులను ఎందుకు రైతులకు అందుబాటులో ఉంచడం లేదని ప్రశ్నించిన దాఖలాలే లేవు. దీంతో డీలర్లు తమను అడ్డుకునే వారే లేరంటూ మరింత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో రైతుల పరిస్థితి దారుణంగా తయారైంది.



కొత్తబస్టాండు సమీపంలో సమాచార బోర్డులు కనిపించని దృశ్యం

అంగన్‌వాడీలకు కనీస వేతనాలు ఇవ్వాలి

కల్లూరు, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు కనీస వేతనాలు ఇవ్వాలని సీఐటీయూ మండల కార్యదర్శి కె.మధు డిమాండ్ చేశారు. గురువారం కల్లూరు తహసీల్దారు కార్యాలయం ముందు అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు ధర్నా చేశారు. మధు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో 45 రోజుల పాటు అంగన్‌వాడీలు సమ్మె చేసి సాధించుకున్న డిమాండ్లను అమలు చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం వేతనాలు పెంచడంలో అలసత్వం వహిస్తుందని విమర్శించారు. అనం తరం కల్లూరు తసీల్దారు కె.ఆంజనేయులుకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు మహమ్మద్‌రఫీ, అంగన్‌వాడీ టీచర్లు వెంకటేశ్వరమ్మ, లక్ష్మీదేవి, పద్మ, ఆదిలక్ష్మీ, పద్మజ, ఈశ్వరమ్మ పాల్గొన్నారు.

కర్నూలు రూరల్: అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లకు కనీస వేతనాలు రూ.26వేలు ఇవ్వాలని సీఐటీయూ, ఏఐటీ యూసీ జిల్లా అధ్యక్షులు రాధాకృష్ణ, ప్రధాన కార్యదర్శి మునెప్ప ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కర్నూలు అర్బన్ మండల తహసీల్దార్ కార్యలయం ఎదుట గురువారం ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు ధర్నా చేశారు. అనంతరం అర్బన్ మండల డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈకార్యక్ర మంలో యూనియన్ నాయకురాలు రేణుకమ్మ, చౌడేశ్వరి, విజయలక్ష్మీ, బాగ్యమ్మ, అంజలి, సునంద, వరలక్ష్మి పాల్గొన్నారు.

గూడూరు: అంగన్‌వాడీలకు వేతనాలు పెంచాలని సీఐటీయూ డివిజన్ కార్యదర్శి జే మోహన్, అంగన్ వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు రత్నమ్మ, సునంద, చాంద్‌బీ డిమాండ్ చేశారు. గురువారం గూడూరులోని రెవెన్యూ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ రాఘవేంద్ర రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్‌వాడీల సమస్యలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పరిష్కరించకుండా కాల యాపన చేస్తున్నాయన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్మికులు రామాంజనమ్మ, ప్రేమమ్మ, రామలక్ష్మి, సులోచన, రామేశ్వరమ్మ పాల్గొన్నారు.

సి.బెళగల్: అంగన్‌వాడీ వర్కర్లకు జీతాలు పెంచాలని సీఐటీయూ నాయకుడు మోహన్ డిమాండ్ చేశారు. గురువారం తహసీల్దార్ వెంకట లక్ష్మికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్లు కళావతి, సరోజమ్మ, మరియమ్మ, ఉశేన్‌బీ, దస్తగిరిమ్మ, ఇంతియాజ్, మేరి, రాధమ్మ, శైలజ, మహేశ్వరి పాల్గొన్నారు.



కల్లూరు తహసీల్దారుకు వినతిపత్రం ఇస్తున్న సీఐటీయూ నాయకులు



ఓర్వకల్లులో..

ఓర్వకల్లు: అంగన్‌వాడీలకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని సీఐటీయూ జిల్లా నాయకుడు శ్రీధర్ కోరారు. గురువారం ఓర్వకల్లులోని ప్రజా సంఘాల కార్యాలయం నుంచి ర్యాలీగా వచ్చి తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా ధర్నా నిర్వహించారు. సర్వే డిప్యూటీ తహసీల్దార్ షర్మిలారెడ్డికి వినతిపత్రం సమర్పించారు. శ్రీధర్ మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు రకరకాల యాప్‌లు లేకుండా అన్నింటినీ కలిపి ఒకే యాప్‌ను తెస్తామని చెప్పడం సరికాదన్నారు. నాయకులు షాజహాన్, సుధాకర్, అంగన్‌వాడీ నాయకులు సరళ, సువర్ణ, మహేశ్వరి, రోజా, రమణీ బేగ్ పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణుల సంక్షేమానికి కృషి చేయాలి

పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి



పార్వతమ్మను సన్మానిస్తున్న ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి

కల్లూరు, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): విశ్వబ్రాహ్మణుల అభివృద్ధి, సంక్షేమానికి చైర్‌పర్సన్ పార్వతమ్మ కృషి చేయాలని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి అన్నారు. గురువారం విజయవాడ గొల్లపూడిలోని బీసీ సంక్షేమ భవనంలో బీసీ కార్పొరేషన్ జాయింట్ డైరెక్టర్ ఉమాదేవి ఏపీ విశ్వబ్రాహ్మణ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ చైర్‌పర్సన్‌గా కె.పార్వతమ్మతో ప్రమాణస్వీకారం చేయించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే గౌరుచరితతో పాటు నంద్యాల జిల్లా టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్, ఏపీ సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి, తెలంగాణ మాజీ స్పీకర్, ఎమ్మెల్సీ మధుసూదనాచారి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తెలుగుదేశం పార్టీ అభివృద్ధికి కృషి చేసిన వారందరికీ పదవులు వస్తాయన్నారు. కె.పార్వతమ్మ మాట్లాడుతూ ఎమ్మెల్యే గౌరు చరిత, గౌరు వెంకటరెడ్డి దంపతుల సహకారంతో సీఎం చంద్రబాబునాయుడు ఆశీస్సులతో లభించిన అవకాశాన్ని అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. కార్యక్రమంలో జనార్ధనాచారి, రాఘవేంద్రాచారి, కృష్ణవేణి, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రూ.400కే బీఎస్ఎన్ఎల్ ట్రిపుల్ ప్లే సర్వీసులు

కర్నూలు న్యూసిటీ, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): భారత సంచార్ నిగమ్ లిమిటెడ్ సంస్థ అధ్వర్యంలో వినియోగదారులకు మరిన్ని సేవలను సులభతరం చేసేందుకు రూ.400కే ట్రిపుల్ ప్లే సర్వీసులు ప్రారంభించిందని కర్నూలు బిజినెస్ ఏరియా జనరల్ మేనేజర్ జి.రమేష్ తెలిపారు. గురువారం ప్రకాష్ నగర్‌లోని కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని సంస్థ వినియోగదారుల కోసం ఒకే ప్లాన్ ద్వారా హై స్పీడ్ ఇంటర్నెట్, టీవీ చానళ్లు, ఓటీటీలు, వాయిస్ టెలిఫోన్ సేవలను అతి తక్కువ ధరలో అందుబాటులోకి తీసుకువచ్చిందన్నారు. ఈ ట్రిపుల్ ప్లే సర్వీసుల ద్వారా వినియోగదారులు కేవలం రూ.400 చెల్లిస్తే ఈటీవీ, మాటీవీ, జెమిని, జీ టీవీ లాంటి మరెన్నో ప్రముఖ చానల్లతో సహ 300కు పైగా చానళ్లు 9 ఓటీటీ అప్లికేషన్లతోపాటు దేశమంతటా వాయిస్ కాల్స్ చేసుకునే అవకాశం ఉందన్నారు. ఈ ప్లాన్ ఉమ్మడి జిల్లాలోని అన్ని నగరాలు, పట్టణాల్లో అందుబాటులో ఉందన్నారు. అదేవిధంగా రూ.1కే ఫ్రీడమ్ ప్లాన్‌తో 30 రోజుల పాటు ప్రతి రోజు 2జీబీ డేటా, అపరిమితమైన కాల్స్ 100 ఎస్ఎంఎస్‌లు పొందవచ్చన్నారు. వివరాలకు జానకిరామ్ రూ.9422464999కు సంప్రందించాలన్నారు. డీజీఎం కే.రాజేశ్వరరావు, ఐఎస్‌పి డి.శ్రీలత, ఏజీఎం శ్రీను నాయక్ పాల్గొన్నారు.

ఏఐతో ప్రయోజనాలెన్నో..

కర్నూలు ఎడ్యుకేషన్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ విభాగంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సీతో ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని కళాశాల సీఈవో డాక్టర్ హరికృష్ణ పేర్కొన్నారు. గురువారం దూపాడులోని అశోకా ఇంజనీరింగ్ కళాశాలలో ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ ప్రారంభమైంది. సీఈవో హరికృష్ణ మాట్లాడుతూ శిక్షణా కార్యక్రమాలు ఉపాధ్యాయుల ద్వారా విద్యార్థులకు చేరడం సమాజానికి మేలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నవీన్, అధ్యాపకులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే



నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే దస్తగిరి

సి.బెళగల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి అన్నారు. గురువారం మండలంలోని బ్రాహ్మణదొడ్డి గ్రామ చెరువుకు ఎల్లెల్సీ నీటిని విడుదల చేశారు. ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి మాట్లాడుతూ మండలంలోని పుకులర్తి, చింతమానుపల్లె, రేమట ఎత్తిపోతలపథకాల ద్వారా సాగునీరు విడుదల చేశామన్నారు. కార్యక్రమంలో డీసీ మెంబరు లక్ష్మన్న, టీడీపీ మండల కన్వీనర్ చంద్రశేఖర్, అమర్, బాబు, శంకర్, జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు తాంద్రపాడు జయన్న, జిక్రియ్య షబ్బీర్ పాల్గొన్నారు.

మట్టి వినాయకుడిని పూజిద్దాం

కర్నూలు రాజ్‌విహార్ సర్కిల్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): మట్టి వినాయకుడిని పూజించి పర్యావరణాన్ని కాపాడుకుందామని ఏపీ కాలుష్య నియంత్రణ మండలి పర్యావరణ ఇంజనీరు పీవీ కిషోర్‌రెడ్డి అన్నారు. గురువారం ఎ.క్యాంపు మాంటిసోర్సి, లేబర్‌కాలనీలోని కోట్ల విజ య భాస్కరరెడ్డి ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మట్టి వినాయకుని రూప కల్పనపై పోటీలను నిర్వహించారు. పీవీ కిషోర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే పర్యావరణహిత కార్యక్రమాల పట్ల అవగాహన కల్గి ఉండాలన్నారు. కాలుష్య నియంత్రణ మండలి కర్నూలు ఆధ్వర్యంలో ప్రజలకు దాదాపు వేయి మట్టి ప్రతిమలు, వస్త్ర సంచులను పంపిణి చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. అనంతరం మట్టి ప్రతిమ తయారీలో నైపుణ్యం చూపిన విద్యార్థులకు బహుమతి ప్రదానం చేసి, వారిని అభినందించారు. కార్యక్ర మంలో కాలుష్య నియంత్రణ మండలి అధికారులు నరసింహులు, పవన్ పాల్గొన్నారు.

నీట్ పీజీ ప్రవేశ పరీక్షలో విద్యార్థిని ప్రతిభ

కర్నూలు ఎడ్యుకేషన్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): ఇటీవల నిర్వహించిన నీట్ పీజీ ప్రవేశ పరీక్షలో కర్నూలు మెడికల్ కాలేజీకి చెందిన డా.కుశినేని తనూజ అనే విద్యార్థిని ప్రతిభ కనబరిచారు. గూడూరు పట్టణానికి చెందిన కుసినేని గిడ్డయ్య, సావిత్రి దంపతుల నాలుగో సంతానం కుసినేని తనూజ. ఈమె పదో తరగతి వరకు గూడూరు జడ్పీ బాలికల పాఠశాలలో విద్య నభ్యసించింది. ఇంటర్మీడియట్ కర్నూలు నారాయణ జూనియర్ కళా శాలలో చదివారు. ఐదేళ్ల క్రితం నిర్వహించిన నీట్ యూజీ ప్రవేశ పరీక్షలో ప్రతిభను కనబరిచి కర్నూలు ప్రభుత్వ మెడికల్ కాలేజీలో సీటు దక్కిం చుకుంది. ఈనెల 3వ తేదీ నీట్ పీజీ ప్రవేశ పరీక్షను జాతీయ స్థాయిలో నిర్వహించారు. ఈ పరీక్షలో 573 మార్కులు సాధించి జాతీయ స్థాయిలో 6675 ర్యాంకు సాధించింది. జాతీయ స్థాయిలో ర్యాంకు రావడం పట్ల ఆమె కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

డైరెక్టర్లలో ఎస్సీలకు సముచిత స్థానం

కర్నూలు అర్బన్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): కర్నూలు మార్కెట్ యార్డు డైరెక్టర్ల కేటాయింపులో మంత్రి టీజీ భరత్ ఎస్సీ సామాజిక వర్గానికి సముచిత స్థానం కల్పించారని టీడీపీ నగర ఎస్సీ సెల్ కమిటీ అధ్యక్షుడు పి.శివప్రసాద్ అన్నారు. గురువారం నగరంలోని టీడీపీ కార్యాలయంలో డైరెక్టర్లుగా ఎన్నికైన మాధవ స్వామి, సువార్తమ్మ, బి.చిన్నమ్మ, ఆర్ కళ్యాణిలను ఘనంగా సన్మానించారు. శివప్రసాద్ మాట్లాడుతూ ఒకే సారి ముగ్గురు ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన వారికి డైరెక్టర్లుగా నియమించడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. కార్యక్ర మంలో ఉపా ధ్యక్షుడు కె.ఏసన్న, దినేష్, భాస్కరరావు, ఎం.శివప్రసాద్, జోహరాపురం టీడీపీ నాయకులు ఆనంద్, కొత్తపేట వార్డు ఇన్‌చార్జి మనీష్ నాయుడు, మార్కెట్ యార్డు డైరెక్టర్ గాండ్ల శ్రీధర్, అన్వర్‌బాషా పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలను ఆదుకోవాలి: మాజీ ఎమ్మెల్సీ

కర్నూలు అర్బన్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): ఆస్పరి మండలం చిగిలి గ్రామంలో ఆరుగురు విద్యార్థులు ప్రమాదవశాత్తు మృతి చెందారని, వారి కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్సీ ఎం.సుధాకర్ బాబు డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు , డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ బాధిత కుటుంబాలకు సానుభూతిని తెలియజేశారని, అదేవిధంగా ఆ కుటుంబా లకు ఒక్కొక్కరికి రూ. 20 లక్షలు ఆర్థిక సాయం, రెండు ఎకరాల పొలం, ఒక్కరికి ఉద్యోగం ఇవ్వాలని కోరారు. సమావేశంలో జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ ఎస్సీ బజా రన్న, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు బి.బ్రతుకన్న, షేక్ ఖాజా హుస్సేన్, లాజరస్ పాల్గొన్నారు.

కర్నూలు న్యూసిటీ: ఆస్పరి మండలం చిగిలి గ్రామంలో మృతి చెందిన విద్యార్థుల కుటుంబాలకు ప్రభుత్వం రూ.50లక్షలు ఆర్థిక సాయం అందించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య గురువారం ఒక ప్రకటనలో కోరారు. బాధిత కుటుంబాలకు ఆయన సానుభూతిని తెలియజేశారు.

- బాధిత కుటుంబాలను ప్రభుత్వమే ఆదుకోవాలని ప్రజా పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడే కే.బలరాం డిమాండ్ చేశారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని తల్లితండ్రులు పిల్లలను గమనిస్తూ ఉంటే ఇలాంటి సంఘటనలు చోటు చేసుకోవని అన్నారు.



మాట్లాడుతున్న సుధాకర్ బాబు

పెన్షన్ సమస్యల పరిష్కారానికి చర్యలు

కర్నూలు న్యూసిటీ, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కార్మికుల పెన్షన్ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని డీసీఎంఎస్ అధ్యక్షుడు వై.నాగేశ్వరరావు యాదవ్ అన్నారు. గురువారం కార్మిక కర్షక భవన్‌లో సి.శేఖర్ అధ్యక్షతన ఆర్టీసీ ఓపీఎస్ సాదన సమితి ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. నాగేశ్వరరావు యాదవ్ మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం ఆర్టీసీ కార్మికుల ఆశించిన పాత పెన్షన్ పథకం అమలు చేయలేదన్నారు. రిటైర్డ్ అయిన కార్మికులకు ప్రభుత్వం అమలు చేస్తున్న సామాజిక పెన్షన్ రూ.4000 కంటే తక్కువగా వస్తుందని వారికి న్యాయం చేయడానికి కృషి చేస్తామన్నారు. ఈ సదస్సులో ఆర్టీసీ స్టాండ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కోశాధికారి జే.దివాకర్, ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఏవీ రెడ్డి, ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎన్ఆర్.నాయుడు, విశాంత్ర ఉద్యోగుల సంఘం జిల్లా కార్యదర్శి బి.శ్రీనివాసులు, ఎస్ఎస్.రావు, కేజేఎం.రావు, చంద్రమోహన్ పాల్గొన్నారు.

నాసిరకం నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి

కర్నూలు న్యూసిటీ, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): నగరంలో నాసిరకం నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని పట్టణ పౌర సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఇరిగినేని పుల్లారెడ్డి డిమాండ్ చేశారు. గురువారం కృష్ణానగర్ ఐటీసీ కంపెనీ సమీపంలో జాతీయ రహదారి సర్వీస్ రోడ్డు కల్వర్టులో దిగబడిన లారీని పరిశీలించారు. పుల్లారెడ్డి మాట్లాడుతూ రాఘవేంద్ర నగర్ సమీపంలో హైవే సర్వీస్ రోడ్డు చివరిలో ఉన్న కల్వర్టులో లారీ దిగబడటంతో డ్రైవర్ చాకచక్యంగా ప్రమాదం తప్పించారన్నారు. నెల క్రితం పూలబజార్ కూడలిలో కూడా ఇలాగే ఓ లారీ కల్వర్టులో దిగబడిందని ఆయన గుర్తు చేశారు. అన్ని శాఖ అధికారులు ప్రధాన రోడ్లను పరిశీలించి నారసిరకం నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పెద్దన్న, అమర్నాథరెడ్డి, కె.శీనివాసులు పాల్గొన్నారు.

డీఎస్సీ మెరిట్ లిస్టు విడుదల చేయాలి: ఏఐవైఎఫ్

కర్నూలు న్యూసిటీ, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): డీఎస్సీ మెరిట్ లిస్టును వెంటనే విడుదల చేయాలని, పాత పద్ధతిలోనే టీచర్ పోస్టులను భర్తీ చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక సీఆర్ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. డీఎస్సీ అభ్యర్థులను గందరగోళం చేసే విధంగా విద్యాశాఖ అధికారుల తీరు ఉందన్నారు. గతంలో ఏ డీఎస్సీకి లేనివిధంగా ఈ డీఎస్సీకి నిబంధనలు పెట్టడం సరికాద న్నారు. సమావేశంలో నగర కార్యదర్శి బీసన్న, నాయకులు చంటి, శివాజీ, అంజి, అశోక్ పాల్గొన్నారు.

పచ్చదనం పెంపునకు సహకరించాలి: కమిషనర్

కర్నూలు న్యూసిటీ, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): నగరంలో పచ్చదనం పెంపునకు ప్రకృతి ప్రేమికులు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజలు సహకరించాలని నగర పాలక కమిషనర్ పి.విశ్వనాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ నెల నుంచి పదివేల మొక్కలు నాటినట్లు ఆయన వెల్లడించారు. అశోక్‌నగర్ పంప్‌హౌస్‌లో కానుగ, సితాఫల్, బాదం, వేప, రెయిన్ ట్రీ తదితర మొక్కలు ఉచితంగా పంపిణీ చేశామన్నారు. ప్రకృతి ప్రేమికులు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి ఖాళీ స్థలాలు, మైదానల్లో మొక్కలు నాటాలని ఆయన సూచించారు.

కోడుమూరు మార్కెట్ యార్డు కమిటీ నియామకం

కోడుమూరు రూరల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): కోడుమూరు మార్కెట్ కమిటీ నియామకానికి ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసింది. గౌరవ చైర్మన్‌గా ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరిని పేర్కొంటూ 20 మందితో కమిటి ఏర్పాటు చేసింది. మార్కెట్‌యార్డు కమిటీ చైర్మన్‌గా ఆకెపోగు సుగుణమ్మ, వైస్ చైర్మన్‌గా ఎల్లప్పనాయుడుతో పాటు 17 మంది సభ్యులను ఎన్ను కున్నారు. చైర్మన్ సుగుణమ్మ స్వగ్రామం తాంద్రపాడు, కాగా వైస్‌చైర్మన్ ఎల్లప్పనాయుడు కోడుమూరు పట్టణవాసి. పార్టీకి అందించిన సేవలను గుర్తించిన కేడీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరిలకు వైస్‌చైర్మన్ ఎల్లప్పనాయుడు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు 'డయల్ యువర్ విద్యుత్ ఎస్ఈ'

కల్లూరు, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): జిల్లా వినియోగదారులు సమస్యల పరిష్కారానికి డయల్ యువర్ విద్యుత్ ఎస్ఈ కార్యక్రమాన్ని నిర్వహి స్తున్నట్లు ఎస్ఈ ఎం.ఉమాపతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు శుక్రవారం ఉదయం 10గంటల నుంచి 11 వరకు సెల్ నెంబరు: 7382614308కు ఫోన్ చేయాలన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, లోఓల్టేజీ, విద్యుత్ సిబ్బంది అందుబాటులో ఉన్నారా అన్న అంశాలపై సమస్యలు తెలియజేయాలని ఆయన ప్రజలకు సూచించారు.

రగ్బీ లీగ్ పోటీలు ప్రారంభం

కర్నూలు స్పోర్ట్స్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): నగర శివారులోని ఆదర్శ విద్యామందిర్ క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన అస్మిత రగ్బీ లీగ్ పోటీలను రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ గురువారం ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో ఆదర్శ విద్యాసంస్థల డైరెక్టర్ హరికిషన్, రగ్బీ క్రీడా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు, జిల్లా అధ్యక్షుడు సురేంద్ర, సాయి, కోచ్ కాశీరావు, ప్రైవేటు పీఈటీల జిల్లా సంఘం అధ్యక్షులు చిన్న సుంకన్న, హాకీ సంఘం కార్యదర్శి దాసరి సుధీర్ పాల్గొన్నారు. అనంతరం టీజీని శాలువ కప్పి సన్మానించారు.

పదోన్నతులు కల్పించాలి

కర్నూలు ఎడ్యుకేషన్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా డీఈవో పూల్‌లో ఉన్న బాషా పండితులకు పాఠశాలల సహాయకులుగా పదోన్నతులు కల్పించాలని ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, ప్రభుత్వ విప్ ఆదినారాయణరెడ్డితో కలిసి సీఎం చంద్రబాబుకు వినతి పత్రం అందజేశారు. గత వైసీపీ ప్రభుత్వం తీసుకున్న అనాలోచిత నిర్ణయాలతో రాష్ట్ర వ్యాప్తంగా 1461 మంది బాషా పండితులు డీఈవో పూల్‌లో ఉన్నారని, వీరందరికీ గత ఆరేళ్లుగా పని ఒక చోట చేస్తూ వేతనాలు మరో చోట తీసుకునే పరిస్థితి ఏర్పడిందన్నారు.

నేడు సి.బెళగల్‌లో గ్రీవెన్స్ డే

సి.బెళగల్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన సి.బెళగల్ రెండో సచివాలయంలో శుక్రవారం గ్రీవెన్స్ డేను నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ వెంకటలక్ష్మి తెలిపారు. కార్యక్రమానికి జేసీ నవ్య హాజరవుతారన్నారు.

విద్యార్థి బస్సు నడపాలి


వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఆదోని అగ్రికల్చర్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): పాఠశాల, కళాశాలలకు వెళ్లే విద్యార్థులకు అనుకూల సమయంలో విద్యార్థి బస్సు నడపాలని పీడీఎస్‌యూ డివిజన్ కార్యదర్శి శివ కోరారు. గురువారం ఆర్టీసీ ట్రాఫిక్ సీఐకి వినతిపత్రం అందజేశారు. దొడ్డనకేరి చుట్టుపక్కల గ్రామాల విద్యార్థులు రోజూ పట్టణానికి చదువుకోవడానికి వస్తున్నారని, బస్సులు లేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాజు, కేశవ, గోవిందు, తిరుమల గౌడ్, బాషా, రము పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో వైద్య శిబిరం


వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

ఆదోని టౌన్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని ఆరేకల్ గ్రామ ప్రభుత్వ గురుకుల పాఠశాలలో ఐఎంఏ ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. సెంట్రల్ కమిటీ సభ్యుడు డాక్టర్ గోపీనాథ్ మాట్లాడుతూ వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు రావడం సహజమని వాటిని ప్రారంభంలోనే గుర్తించి చికిత్స పొందాలన్నారు. హాస్టల్ విద్యార్థుల ఆరోగ్యం పట్ల వార్డెన్లు శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. వైద్యులు కృష్ణమూర్తి, గోపీనాథ్, అనూష, సాయికుమార్, ఉమాదేవి ఉన్నారు.

25 నుంచి వేరుశనగ గ్రేడింగ్‌కు స్వస్తి

● ఆదోని మార్కెట్ యార్డ్ కార్యదర్శి కల్పన



ఆదోని అగ్రికల్చర్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): వేరుశనగ గ్రేడింగ్ (పాసింగ్) విధానానికి ఈనెల 25 నుంచి స్వస్తి పలకనున్నట్లు మార్కెట్ యార్డ్ కార్యదర్శి ఎం.కల్పన పేర్కొన్నారు. గురువారం చాంబర్‌లో విలేకరులతో సమావేశం నిర్వహించారు. రైతులకు నష్టం కలిగిస్తున్న గ్రేడింగ్ విధానానికి స్వస్తి పలకాలని ఇప్పటికే వ్యాపారులు, హమాలీలు, కమీషన్ ఏజెంట్లతో చర్చించామన్నారు. వ్యాపారులు అంగీకరించలేదని అయినా ఖచ్చితంగా స్వస్తి పలకాల్సిందేనని కఠినంగా తెలియజేశామన్నారు. రైతులు రోడ్డు, మట్టిని తమ ఇంటి వద్దే తొలగించి సరుకును తీసుకురావాలన్నారు. కర్నూలు, ఎమ్మిగనూరు సహా ఎక్కడా పాసింగ్ లేదని ఇక్కడే ఎందుకు చేస్తున్నారని వ్యాపారులను ప్రశ్నించామన్నారు. వ్యాపారులు టెండర్ పూర్తయిన వెంటనే తూకాల గన్ని బ్యాగులను దుకాణాలకు ఇవ్వాలని తెలిపామన్నారు. మధ్యాహ్నంలోపు తూకం వేసి, రైతులకు చెల్లింపులు చేసేలా చూస్తామన్నారు. సహాయ కార్యదర్శి కుమార్ ఉన్నారు.

భోజనం సక్రమంగా అందించాలి

మద్దికెర ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు మధ్యాహ్న భోజనం సక్రమంగా అందించాలని ఎంఈవో రంగస్వామి సూచించారు. గురువారం జడ్పీ బాలుర, బాలికల పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. హెచ్‌ఎం దేవేంద్రప్ప, మోహన్ ఉన్నారు.

పొలాలకు దారి చూపాలి


తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న రైతులు

పత్తికొండ టౌన్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): తమ పొలాలకు దారి చూపాలని జుగ్గతండా రైతులు లోక్యానాయక్, రామచంద్రనాయక్, సోమ్లానాయక్ కోరారు. ఈమేరకు గురువారం తహసీల్దార్ ఉసేన్ సాహెబ్‌ను వేడుకున్నారు. గ్రామానికి సోమ్లానాయక్ అనే వ్యక్తి రస్తాకు అడ్డు చెప్పడంతో ఇబ్బంది పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన తహసీల్దార్ విచారణ చేసి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

టెక్నికల్ అసిస్టెంట్‌పై చర్యలు తీసుకోవాలి

పత్తికొండ టౌన్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): భూ తగాదాల్లో తలదూరుస్తున్న ఉపాధిహామీ టెక్నికల్ అసిస్టెంట్ మహేష్‌పై చర్యలు తీసుకోవాలని బాధితురాలు మల్లేశ్వరమ్మ డిమాండ్ చేశారు. గురువారం ఎంపీడీవో కవితకు వినతి పత్రం అందించారు. దూదేకొండ గ్రామ రెవెన్యూ పరిధిలో సర్వేనంబర్లు 721/2, 757/3, 757/1లో మొత్తం విస్తీర్ణం 10.52 ఎకరాల స్థలం తన తల్లిదండ్రుల ఆస్తి అన్నారు. ఈ విషయ టీఏ మహేష్‌ను వివరణ కోరగా, తాను భూ వివాదాల్లోకి తలదూర్చలేదన్నారు.

శిథిలావస్థ

● పెచ్చులూడుతున్న మున్సిపల్ దుకాణాలు



పెచ్చులూడిన పైకప్పు, కూలేందుకు సిద్ధంగా ఉన్న బాల్కనీ

ఆదోని టౌన్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రధాన రహదారిలో నిర్మించిన మున్సిపల్ కాంప్లెక్స్ భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. మొదటి అంతస్తులోని దుకాణాల పైకప్పు పెచ్చులూడుతోంది. దీంతో లీజుదారులు ఆందోళన చెందుతున్నారు. మున్సిపల్ అధికారులు నెలనెలా బాడుగలను వసూలు చేసుకోవడం మూడేళ్లకోసారి బాడుగలను పెంచడం తప్ప, దుకాణాలను పట్టించుకోవడం లేదని లీజుదారులు ఆరోపిస్తున్నారు.

ఆందోళన చెందుతున్న లీజుదారులు

తరచుగా ప్రమాదాలు జరుగుతుండటంలో లీజుదారులు ఆందోళన చెందుతున్నారు. కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలతో మంగళవారం రాత్రి బీసీ సంఘం నాయకుడు బోయ నీలకంఠప్ప లీజు తీసుకున్న దుకాణం పైకప్పు పెచ్చులూడింది. అర్ధరాత్రి కావడంతో ఎవరికీ ప్రమాదం వాటిల్లలేదు. దుకాణాలకు మరమ్మతులు చేయించాలని లేదా ఆలాకాని పక్షంలో నూతన భవనాలను నిర్మించాలని లీజుదారులు డిమాండ్ చేస్తున్నారు.

పట్టణంలోని మున్సిపల్ మెయిన్ రోడ్డుతో పాటు రైల్వే స్టేషన్ రోడ్డులో 1978లో నాటి ఎమ్మెల్యే హల్వి సత్యనారాయణ రావు దుకాణాలను ప్రారంభించారు. పట్టణం విస్తరిస్తూ ఉండటం డిమాండ్ రావడం మొదటి అంతస్తులో కూడా దుకాణాలను నిర్మించారు. అయితే పర్యవేక్షణ కొరవడిన కారణంగా మొదటి అంతస్తులోని షాపులు శిథిలావస్థకు చేరుకున్నాయి. షాపులలోని సీలింగ్ ప్లాస్టరింగ్ ఊడి కింద పడటం, బయటవైపు ఉన్న బాల్కనీ పిట్ట గోడ కూలిపోయేలా ఉంది.

పరిశీలించి నిర్ణయం తీసుకుంటాం



మున్సిపల్ దుకాణాలు మొదటి అంతస్తులో చాలా వరకు ఖాళీగా ఉన్నాయి. రెవెన్యూ ఆఫీసర్‌ను పంపి పరిశీలన చేయిస్తాం. ఆర్‌అండ్‌బీ అధికారులను సంప్రదించి భద్రతపై అభిప్రాయం తీసుకుని చర్యలు తీసుకుంటాం. - **కృష్ణ, మున్సిపల్ కమిషనర్**

రైతుకు సేవలేవ్వీ?

● తెరుచుకోని రైతు సేవా కేంద్రం-2


తెరుచుకోని రైతు సేవా కేంద్రం-2

మద్దికెర ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): రైతుల అవసరాలకు అనుగుణంగా సేవలందించడానికి ప్రభుత్వం రైతు సేవా కేంద్రాలను ఏర్పాటు చేసింది. వీటిలో వ్యవసాయ గ్రామ వ్యవసాయ సహాయకులు (వీఏఏ) అందుబాటులో ఉండి సలహాలను సూచనలు ఇవ్వాలి. యూరియా, ఎరువులు తదితర వ్యవసాయ సేవలను అందించాలి. కానీ మద్దికెరలోని రైతుసేవా కేంద్రం-2 గురువారం మధ్యాహ్నం ఒంటి గంట దాటినా తెరుచుకోలేదు. రైతులు ఎరువుల కోసం వచ్చి నిరాశతో వెనుదిరిగారు. ఏవో రవిని సంప్రదించగా విచారణ చేసి చర్యలు తీసుకుంటామన్నారు.

రీ సర్వే పూర్తి చేయాలి

హొళగుంద, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలో రీ సర్వేను వెంటనే పూర్తి చేయాలని తహసీల్దార్ లక్ష్మీనారాయణ ఆదేశించారు. గురువారం కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. వీఆర్వోలు, సర్వేయర్లు, ఆర్‌ఐలు పక్కడ్బందీగా హద్దులు చూపించాలని సూచించారు. గ్రామాల్లో ఫిర్యాదులు వస్తే తన దృష్టికి తీసుకురావాలన్నారు. సర్వేయర్ బార్గవి ఉన్నారు.

క్రీడలతో విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు


కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

ఆదోని అగ్రికల్చర్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులతకు క్రీడలతో నాయకత్వ లక్షణాలను అలవరతాయని డిప్యూటీ ఈవో వెంకటరమణా రెడ్డి పేర్కొన్నారు. గురువారం మున్సిపల్ క్రీడా మైదానంలో పీఈటీలు నిర్వహించే జాతీయ క్రీడా దినోత్సవాల్లో బాగంగా కబడ్డీ పోటీలను ప్రారంభించారు. డిప్యూటీ ఈవో వెంకటరమణా రెడ్డి ఎంఈవో శ్రీనివాసులు క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. క్రీడ కోటాలో ప్రభుత్వ ఉద్యోగాలు పొందవచ్చని, గెలుపోటములను సమానంగా తీసుకోవాలని సూచించారు. ఈనెల 29 న ఫైనల్ విజేత జట్లకు బహుమతులు ప్రదానం చేస్తామని నిర్వాహకులు తెలిపారు. హెచ్‌ఎంలు మల్లికార్జున, పయాజుద్దీన్, రిటైర్డ్ పీఈటీ నరసయ్య, నాయకులు నరసింహరాజు, నరసింహులు, రామన్న పాల్గొన్నారు.

పింఛన్ల తొలగింపు తగదు


దేవనకొండలో ధర్నా చేస్తున్న దివ్యాంగులు

దేవనకొండ, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల పింఛన్ల తొలగింపు తగదని మండల సమైక్య కార్యదర్శి ఉరుకుందమ్మ, సభ్యుడు దొని ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం ఎంపీడీవో కార్యాలయం వద్ద ప్రజా సంఘాల నాయకుల నాయకుల ఆధ్వర్యంలో ధర్నా చేశారు. తొలగించిన పింఛన్లను వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఆనంద్, బజారి, రంగమ్మ ఉన్నారు.

దివ్యాంగుల గగ్గోలు

మద్దికెర: తమ పింఛన్లు రద్దుకావడంతో దివ్యాంగులు గగ్గోలు పెడుతున్నారు. మండలంలోని 11 గ్రామాల్లో 64 దివ్యాంగ పింఛన్లు రద్దయ్యాయి. ఇప్పటికే సచివాలయ సిబ్బంది లబ్ధిదారులకు నోటీసులు అందజేశారు. కాగా 70, 80 శాతం వైకల్యం ఉన్న కూడా రద్దుచేశారని దివ్యాంగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పుట్టుకతోనే నాకు మాటలు రావు..



నేను పుట్టుకతోనే మూగ, మాటలు రావు. మొన్నటి వరకు రూ.6వేలు పింఛన్ వచ్చేది ఇప్పుడు తొలగించారు. అధికారులు స్పందించి న్యాయం చేయాలి. - హేమమ్మ, ఎం.అగ్రహారం.

వర్షపు నీటిని తొలగించండి


రత్నపల్లి దళితవాడలో వర్షపు నీరు

వెల్దుర్తి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రత్నపల్లి గ్రామం దళితవాడలో వర్షపు నీరు నిలిచి గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. కాలనీలో సీసీ రోడ్లు, డ్రైనేజీ లేకపోవడంతో వర్షపునీరు ముందుకు పోవడం లేదని, దోమల వ్యాప్తితో ఇబ్బందులు పడుతున్నామన్నారు. అధికారులు స్పందించి వర్షపు నీటిని తొలగించి, సీసీ రోడ్లు, కాలువలను నిర్మించాలని కేవీపీఎస్ మండల కార్యదర్శి నాగరాజు కోరారు.

అధికారులు గైర్హాజరైతే ఎలా?

● మండల సమావేశాన్ని బహిష్కరించిన ప్రజాప్రతినిధులు


నిరసన తెలుపుతున్న సర్పంచ్, ఎంపీటీసీలు

ఆలూరు(చిప్పగిరి), ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): గ్రామ సమస్యలను పరిష్కరించాల్సిన అధికారులు మండల సర్వసభ్య సమావేశానికి గైర్హాజరైతే ఎలా? అని సమస్యలను ఎవరికి చెప్పాలని టీడీపీ ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం చిప్పగిరి మండల సమావేశాన్ని బహిష్కరించారు. మధ్యాహ్నం 12 గంటలైనా సమావేశం ప్రారంభం కాలేదని టీడీపీకి చెందిన సర్పంచులు పురుషోత్తం, సుశీలమ్మ, సావిత్రి, చిప్పగిరి ఎంపీటీసీ సభ్యులు ఎల్లంకి రతన, భీమలింగ ఎంపీడీవో ఆల్బాబక్ష్‌పై అసహనం వ్యక్తం చేశారు.

రోడ్డును బాగు చేసుకున్నారు


గ్రావెల్ వేయిస్తున్న మాజీ జడ్పీటీసీ మీనాక్షినాయుడు

ఆలూరు(చిప్పగిరి), ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): వర్షాల ప్రభావంతో దెబ్బతిన్న చిప్పగిరి-ఏరూరు రహదారిని మాజీ జెడ్పీటీసీ మీనాక్షినాయుడు ఆధ్వర్యంలో నీటి సంఘం అధ్యక్షుడు దనుంజయ్, మాజీ సర్పంచ్ మార్కండ, టీడీపీ నాయకులు రామచంద్ర, విశ్వనాథ్, వెంకటేశ్ సొంత నిధులతో బాగుచేశారు. ఈమేరకు గురువారం 6 కి.మీ. మేర రహదారిపై గ్రావెల్ వేయించారు.

నానో యూరియాతో అధిక దిగుబడి

ఆదోని అగ్రికల్చర్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): నానో యూరియాతో అధిక దిగుబడి పొందవచ్చని ఏడీఏ బాలవర్ధిని రాజు, ఏవో సుధాకర్ సూచించారు. గురువారం ఏడీఏ కార్యాలయంలో నానో యూరియా బాటిళ్లను పరిశీలించారు. ప్రభుత్వం యూరియా కొరతను అధిగమించేందుకు పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించేందుకు నానో యూరియాను ప్రవేశ పెట్టిందన్నారు. నానో కణాలు మొక్కల ఆకుల్లోకి సులభంగా ప్రవేశించి పోషకాలు అందిస్తాయన్నారు.

ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలి

● సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ్


మాట్లాడుతున్న సబ్ కలెక్టర్

ఆదోని, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): గణేష్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ పేర్కొన్నారు. గురువారం మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో గణేష్ ఉత్సవ కమిటీతో సమావేశాన్ని నిర్వహించారు. మండపాల దగ్గర జాగ్రత్తలు తీసుకోవాలని, మహిళల పట్ల గౌరవంగా నడుచుకోవాలని సూచించారు. ఈనెల 31న ఉదయం 10 గంటలకు ఎల్‌ఎల్‌సీలో నిమజ్జనం చేయాలని, రాత్రి 10 గంటల్లోగా పూర్తిచేసే బాధ్యత కమిటీదేనన్నారు. డీఎస్పీ హేమలత, సభ్యులు కునిగిరి నీలకంఠ, ఎమ్మిగనూరు డీఎస్పీ బార్గవి, మున్సిపల్ కమిషనర్ కృష్ణ, బసవన్నగౌడ్, ఎగ్గటి ప్రతాప్, నాగరాజుగౌడ్, దేవిశెట్టి ప్రకాష్ ఉన్నారు.

27 నుంచి ఉత్సవాలు

ఆదోని టౌన్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఈనెల 27వ తేదీ నుంచి 31వ తేదీ వరకు గణేష్ ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఉత్సవ సమితి అధ్యక్షుడు వేణుగోపాల్ అన్నారు. గురువారం వీహెచ్‌పీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. కునిగిరి నీలకంఠ, ఎగ్గటి ప్రతాప్, బసవన్న గౌడ్, ఉన్నారు.


ఆవులను తరలిస్తున్న పంచాయతీ సిబ్బంది

గోశాలకు ఆవులు

ఆలూరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ప్రధాన రోడ్లపై వున్న ఆవులను పంచాయతీ సిబ్బంది గురువారం ఆదోని గోశాలకు తరలించారు. ఈనెల 10న ఆంధ్రజ్యోతిలో 'ప్రాణాలు తీస్తున్న పశువులు' శీర్షికన ప్రచురితమైన కథనానికి పోలీసు, పంచాయతీ అధికారులు స్పందించారు. ఇప్పటికే యజమానులకు నోటీసులు ఇచ్చినా, ఆవులను రోడ్లపైకి వదలడంతో మత్తు ఇంజెక్షన్ వేసి తరలించారు. ఇకపై రోడ్లపైకి పశువులను వదిలితే ఇలాగే చేస్తామని పంచాయతీ కార్యదర్శి రామాంజ నేయులు హెచ్చరించారు.

యూరియా పంపిణీలో అక్రమాలు ఉండకూడదు: కలెక్టర్


ఏవోతో మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ బాషా

వెల్దుర్తి/వెల్దుర్తి టౌన్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): యూరియాలో పంపిణీ అక్రమాలు ఉండకూడదని కలెక్టర్ పి.రంజిత్ బాషా ఆదేశించారు. గురువారం బొమ్మిరెడ్డిపల్లె గ్రామ రైతు సేవా కేంద్రాన్ని తనిఖీ చేశారు. మండలంలో 26వేల ఎకరాలకు ఈక్రాప్ నమోదు పూర్తయిందని ఏవో అక్బర్ బాషా కలెక్టర్‌కు తెలిపారు. సెప్టెంబరు 15వ తేదీ నాటికి పూర్తిచేయాలని కలెక్టర్ సూచించారు. జేడీఏ వరలక్ష్మి, తహసీల్దార్ చంద్రశేఖర్‌వర్మ పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు


బురద దారిలో ఇబ్బంది పడుతున్న డీఎల్‌పీవో

తుగ్గలి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని పత్తికొండ డీఎల్‌పీవో రామమద్దిరెడ్డి హెచ్చరించారు. గురువారం గిరిగెట్ల, చెన్నంపల్లి గ్రామాల్లో సచివాలయాలను తనిఖీ చేశారు. అనంతరం ఓవర్‌హెడ్ ట్యాంకులు, వీధులు, చెరువులను పరిశీలించారు. గ్రామాల్లో రోజూ పారిశుధ్య పనులు చేయాలని, చెత్తను సేకరించి, సంపద కేంద్రాలకు తరలించాలన్నారు. డిప్యూటీ ఎంపీడీవో శ్రీహరి, పంచాయతీ కార్యదర్శులు దేవేంద్ర, కార్తిక్, రంగనాథ్, సిబ్బంది ఉన్నారు.

● కాగా డీఎల్‌పీవో చెన్నంపల్లి గ్రామంలోని రహదారిలో బురదలోనే ఇబ్బంది పడుతూ వెళ్లడం కొసమెరుపు.

వెల్దుర్తిని కర్నూలు జిల్లాలోనే ఉంచాలి


వెల్దుర్తిలో ర్యాలీ నిర్వహిస్తున్న అఖిలపక్ష నాయకులు

వెల్దుర్తి, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): మండలాన్ని కర్నూలు జిల్లాలోనే ఉంచాలని ఎస్సీయే, వామపక్ష, ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం వెల్దుర్తిలో ర్యాలీ నిర్వహించారు. టీడీపీ నాయకుడు సుబ్బారాయుడు, కన్వీనర్ బలరాంగౌడు, సింగిల్ విండో అధ్యక్షుడు రామకాంతిరెడ్డి పాతబస్టాండ్ వద్ద తెలుగుతల్లి, అంబేడ్కర్ విగ్రహాలకు నివాళులర్పించారు. పాతబస్టాండ్ నుంచి ప్రభుత్వ జూనియర్ కళాశాల మీదుగా తహసీల్దార్ కార్యాలయం వరకు 'ఆదోని వద్దు.కర్నూలు ముద్దు' అని నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మాజీ ఎంపీపీ దశరథరామిరెడ్డి, బోయినపల్లి కాంతారెడ్డి సమక్షంలో తహసీల్దార్ చంద్రశేఖరవర్మకు, బొమ్మిరెడ్డిపల్లెకు వచ్చిన కలెక్టర్ రంజిత్‌బాషాకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రామకృష్ణాచారి, జడ్పీటీసీ సుంకన్న, సుదర్శన్‌గౌడు, శాంతి, ప్రజాసంఘాలు, అఖిలపక్ష నాయకులు పాల్గొన్నారు.

నేడు ఆలూరుకు కేంద్ర బృందం

ఆలూరు రూరల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): జలజీవన్ అమలును పరిశీలించేందుకు కేంద్ర బృందం శుక్రవారం ఆలూరు నియోజకవర్గంలో పర్యటిస్తున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మల్లికార్జున, ఏఈ రామ్‌లీలా తెలిపారు. గురువారం మాట్లాడుతూ హొళగుంద మండలం నెరణికి, వందవాగిలి, దేవనకొండ మండల అలారిదిన్నె ఎం.కె.కొట్టాల గ్రామంలో విశ్రాంత సీతా గౌరీశంకర్ ఆధ్వర్యంలో పర్యటిస్తారన్నారు.

25న వాహనాల వేలం

ఆలూరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): పోలీస్‌స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలకు ఈనెల 25న బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ మహబూబ్‌బాషా తెలిపారు. 10 ద్విచక్ర వాహనాలు, 1 కారు ఉన్నాయని, ఆసక్తి గలవారు పాల్గొనాలని కోరారు.

వేతనాలు పెంచాలి

● మండలాల్లో అంగన్‌వాడీల ధర్నా



ఆలూరులో ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

ఆలూరు రూరల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): తమకు వేతనాలు పెంచాలని అంగన్‌వాడీ కార్యకర్తలు డిమాండ్ చేశారు. గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. అనంతరం డీటీ దీపకు వినతి పత్రం అందించారు. సీఐటీయూ నాయకులు కె.పి.నారాయణస్వామి, షాకీర్, అంగన్‌వాడీలు జయశ్రీ, భారతి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

ఆస్పరి: ఐసీడీఎస్ కార్యాలయం వద్ద ధర్నా చేసి, సీడీపీవో మద్దమ్మకు వినతి పత్రం అందించారు. ఏఐటీయూసీ, సీఐటీయూ నాయకులు కృష్ణమూర్తి, రంగన్న, రామాంజనేయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు రత్నమ్మ, ప్రమీలమ్మ, నాగమణి ఉన్నారు.

పత్తికొండ టౌన్: పట్టణంలోని ధర్నా చేసి ఐసీడీఎస్ అధికారికి వినతి పత్రం అందించారు. ఏఐటీయూసీ నాయకులు కృష్ణయ్య, కాంతమ్మ ఆలాగే సీఐటీయూ ఆధ్వర్యంలో రవిచంద్ర, దిబ్బెమ్మలు తహసీల్దార్ ఉసేన్‌సాహెబ్‌కు వినతి పత్రం ఇచ్చారు.

దేవనకొండ: తమకు పనిభారం తగ్గించాలని అంగన్‌వాడీ యూనియన్ నాయకులు జ్యోతి, లక్ష్మీ, శ్రీదేవి డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఎఫ్ఆర్ఎస్, గర్భిణులు, బాలింతలు, పిల్లల నమోదుకు 2జీ సెల్‌ఫోన్ ఇవ్వడంతో ఇబ్బందిగా ఉందన్నారు. గ్రామాల్లో సెల్ సిగ్నల్ సరిగా లేదన్నారు. నాయకులు వీరశేఖర్, సీపీఐ కార్యదర్శి నర్సారావ్, అంగన్‌వాడీలు ఉన్నారు.

హొళగుంద: సమస్యలను పరిష్కరించాలని సంఘం అధ్యక్షురాలు సుజాత, రత్నమ్మ డిమాండ్ చేశారు. గురువారం తహసీల్దార్ లక్ష్మీనారాయణకు వినతి పత్రం అందజేశారు.

నందవరం హెడ్ కానిస్టేబుల్‌కు ఎస్పీ ప్రశంస


హెడ్ కానిస్టేబుల్‌కు ప్రశంసా పత్రాన్ని అందజేస్తున్న ఎస్పీ

నందవరం, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): నందవరం హెడ్ కానిస్టేబుల్ కోదండరామిరెడ్డిని ఎస్పీ విక్రాంత్ పాటిల్ గురువారం అభినందించి ప్రశంసా పత్రాన్ని అందజేశారు. వారం రోజుల క్రితం మహిళ మిస్సింగ్ అయ్యిందని మహిళ బంధువులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వారం రోజుల్లోనే కర్ణాటక ప్రాంతంలో ఉన్న మహిళ ఆచూకీ కనుగొని కోదండరామిరెడ్డి, కానిస్టేబుల్ నరేంద్ర నందవరం స్టేషన్‌కు తీసుకువచ్చి ఆమె బంధువులకు అప్పజెప్పారు. వారంలోపే మిస్సింగ్ కేసును ఛేదించిన కోదండరామిరెడ్డి, నరేంద్రను ఎస్పీ అభినందించి ఇరువురికి ప్రశంసా పత్రాలు అందించారు. ఏఎస్పీ హుసేన్‌సాబ్, డీఎస్పీ భార్గవి కార్యక్రమంలో పాల్గొన్నారు.

కోసిగిలో దొంగతనం

కోసిగి ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన కోసిగిలోని 9వ వార్డులో రైల్వే ఉద్యోగి తుప్పల భీమయ్య, ఈరమ్మ దంపతుల ఇంటికి తాళం వేసి ఉండటంతో గమనించిన దొంగలు ఇంట్లోని బీరువాలో ఉన్న 5తులాల బంగారం,70తులాల వెండి, రూ.10వేల నగదు దోచుకెళ్లినట్లు బాధితుడు రైల్వే ఉద్యోగి భీమయ్య తెలిపారు. భీమయ్య తెలిపిన వివరాల ప్రకారం యథావిధిగా తాను డ్యూటీకి వెళ్లానని తన భార్య ఈరమ్మ ఇంటికి తాళం వేసి కౌతాళం మండలం చిరుతపల్లి గ్రామానికి ఓ వివాహ వేడుకకు వెళ్లిందని, అదే అదునుగా భావించిన దొంగలు ఇంటికి వేసిన తాళం అలాగే ఉండగా.. ఇంటికి ఉన్న కిటీకి ఉన్న జాలీని తొలగించి ఇంట్లోకి ప్రవేశించి ఇంట్లోని బీరువాను పగులకొట్టి అందులో ఉన్న 5 తులాల బంగారు అలాగే 70 తులాల వెండితో పాటు రూ.10వేల నగదు దోచుకెళ్లినట్లు బాధితుడు భీమయ్య కోసిగి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదుచేశాడు.

అర్హులందరికీ పింఛన్లు ఇవ్వాలి

ఎమ్మిగనూరు రూరల్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతి ఒక్కరికీ పెన్షన్ ఇవ్వాలని వీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షులు బీసీ సోమన్న, తాలుకా అధ్యక్షుడు రామాంజనేయులు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి ఎంపీడీవో బంగారమ్మకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చి వికలాంగులకు అన్యాయం చేస్తుందన్నారు. అర్హత ఉన్న వికలాంగులకు కూడా పింఛన్ తీసివేయడం ఏమిటని ప్రశ్నించారు. కార్యక్రమంలో దివ్యాంగులు శ్రీనివాసులు, సుంకన్న, కేశన్న, మారెన్న, బొజన్న పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులు

పెద్దకడబూరు , ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన పెద్దకడబూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు గురువారం స్వాతంత్ర సమరయోధులు కీ.శే. వెంకటరెడ్డి 115వ జయంతి సందర్భంగా వరుసగా రూ 5,016 వేలు, ద్వితీయ స్థానం వచ్చిన వారికి రూ 3,016, తృతీయా స్థానాలు రూ 2,016 వెంకట రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు ధ్యానం, నైతిక విలువలను అలవార్చుకోవాల్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉమారాజేశ్వరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో సర్పంచ్ మృతి

గోనెగండ్ల, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గంజహళ్లి గ్రామ సర్పంచ్ బోయ తేలులింగమ్మ(72) ప్రమాదవశాత్తు ద్విచక్రవాహనం నుంచి కింద పడి గురువారం మృతి చెందారు. సర్పంచ్ కుమారుడు తేలు రాముడు అందించిన సమాచారం మేరకు ఉదయం దేవనబండలోని తమ బంధువుల వివాహానికి తన మనవడు వెంకటేశ్వర్లు ద్విచక్ర వాహనం పై వెళ్లింది. పెళ్లి ముగించుకొని తిరుగు ప్రయాణమై గంజహళ్లి వస్తుండగా బైలుప్పల, అగ్రహారం గ్రామాల మధ్య లింగమ్మ ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనం అదుపుతప్పి కింద పడటంతో లింగమ్మ రోడ్డుపై పడి తలకు తీవ్రమైన గాయాలయ్యాయి. ఎమ్మిగనూరు ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందినట్లు తెలిపారు. మృతి వార్తను తెలుసుకున్న మాజీ ఎంపీపీ కృష్ణారెడ్డి తన ప్రగాఢసానుభూతిని తెలియజేశారు. పార్టీలకు అతీతంగా నాయకులు ఆమెకు నివాళి అర్పించారు.

రైతులందరికీ యూరియా అందేలా చర్యలు


యూరియా పంపిణీ చేస్తున్న తహసీల్దార్ రమాదేవి

మంత్రాలయం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): యూరియా కోసం రైతులు తొందర పడవద్దని, అందరికీ అవసరమైన ఎరువులను అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తహసీల్దార్ రమాదేవి అన్నారు. గురువారం సూగూరు, వగరూరు గ్రామాల్లో 140 మంది రైతులకు 280 బస్తాలను అందజేశామని తెలిపారు. ఒక్కో రైతుకు రెండు బస్తాల ప్రకారం అందజేశామని, రైతులకు అవసరమైనంత యూరియా కొరత లేకుండా చూస్తామని, దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈవో తిరుమలరెడ్డి, రైతు సేవా కేంద్రం ఇన్‌చార్జిలు శేఖర్, మాధన్న పాల్గొన్నారు.

కోసిగి: ఆదోని డివిజన్ పరిధిలో రైతు సేవా కేంద్రాల ద్వారా, ఎరువుల దుకాణాల ద్వారా రైతులకు యూరియా కొరత లేకుండ చూస్తామని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్యభరద్వాజ్ అన్నారు. గురువారం కోసిగిలోని రైతు సేవా కేంద్రంలోని యూరియా నిల్వలను తహసీల్దార్ వేణుగోపాల్‌తో కలిసి పరిశీలించారు.

నందవరం: మండలంలో యూరియా కొరత రానివ్వమని సహకార సంఘం మండల అధ్యక్షుడు ధర్మాపురం గోపాల్, టీడీపీ మండల పార్టీ కన్వీనర్ కాశీంవలీలు తెలిపారు. గురువారం నదికైరవాడి, కొత్తకైరవాడి రైతులకు యూరియా, కాంప్లెక్స్ ఎరువులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఐ టీడీపీ తాలుకా అధ్యక్షుడు నదికైరవాడి వీరేష్, జనసేన పార్టీ మండల అధ్యక్షుడు యల్లప్ప, గ్రామ టీడీపీ అధ్యక్షుడు జజారి, రైతులు పాల్గొన్నారు.


యూరియా పంపిణీ చేస్తున్న
సహకార సంఘం మండల అధ్యక్షుడు, ఏఈవో

కడిదొడ్డి రైతుల కన్నీటి రోదన

● నీట మునిగిన 120 ఎకరాల వరి పైర్లు, విద్యుత్ మోటార్లు ● ఆవేదనలో అన్నదాతలు


వరద నీటితో
కడిదొడ్డి, వల్లూరు, హల్వీ గ్రామాలకు రాకపోకలు బంద్


కడిదొడ్డి గ్రామంలో నీట మునిగిన వరి పైర్లు

కోసిగి ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): వానలు పడి తుంగభద్ర నదికి వరద పోటెత్తితే కడిదొడ్డి గ్రామం తల్లడిల్లిపోతుంది. కర్ణాటకలోని తుంగభద్ర డ్యాం నుంచి 2లక్షల క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల చేయడంతో కోసిగి మండల పరిధిలోని తుంగభద్రనదికి ఆనుకుని ఉన్న కడిదొడ్డి గ్రామం ఆ వరద నీటితో గ్రామంలోని సుమారు 120 ఎకరాలు వరి పైరు నీట మునగడంతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎప్పుడు వరద వచ్చినా కడిదొడ్డి గ్రామస్థులు, రైతులు భయం గుప్పిట్లో గజ గజ వని కిపోతున్నారు. గ్రామం నుంచి వల్లూరు, హల్వీ గ్రామాల ప్రధాన రోడ్లకు వరద పోటెత్తడంతో ఆ గ్రామాలకు కడిదొడ్డి నుంచి రాకపోకలు బంద్ అయ్యాయి. దీంతో కడిదొడ్డి గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అత్యవసరమైన ఆసుపత్రికి, సరుకులకు, హల్వీ వెళ్లే గ్రామాలకు రోడ్డు బంద్ కావడంతో కోసిగి రావాలంటే సుమారు 30 కిలోమీటర్ల దూరం ఉండటంతో గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

తుంగభద్ర డ్యాం నుంచి సుమారు 2 లక్షల క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల చేయడంతో పాటు ఎగువ కర్ణాటకతో పాటు మన రాష్ట్రంలో కురుస్తున్న వర్షాలతో తుంగభద్ర నదికి వరద నీరు పోటెత్తింది. కోసిగి మండల పరిధిలోని అగసనూరు సమీపంలో ఉన్న ఆర్డీఎస్ ఆనకట్ట మీద ఐదు అడుగుల మేర వరద నీరు దిగువకు ప్రవహిస్తుంది. అలాగే మండల పరిధిలోని కడిదొడ్డి గ్రామంలో సుమారు 120 ఎకరాల మేర వరి పైరు నీట మునిగింది. దీంతో గ్రామానికి చెందిన రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడిప్పుడే వరినాట్లు వేసుకున్నామనీ, అప్పుడే తుంగభద్రకు వరద నీరు పోటెత్తడంతో గ్రామ సమీపంలోకి వరద నీరు పోటెత్తడంతో కడిదొడ్డి గ్రామస్థులు రైతులు తీవ్ర ఆందోళనలు చెందుతున్నారు. అలాగే కందుకూరు లక్ష్మీనగర్ క్యాంపు గ్రామాల్లో కూడా వరి పైర్లు సుమారు 20 ఎకరాల మేర నీట మునగడంతో రైతులు ఆవేదన చెందారు. నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని బాధిత రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

ప్రభుత్వమే ఆదుకోవాలి



తుంగభద్ర నదికి వరద భారీగా రావడంతో నదికి ఆనుకుని ఉన్న మా పొలాలు నీట మునిగాయి. ప్రభుత్వమే మమ్మల్ని ఆదుకోవాలి. ప్రతి ఏడాది తుంగభద్రకు వరద వస్తే మేము నష్టపోవాల్సిందే.

- అమ్రేష్, రైతు, కడిదొడ్డి

తీవ్రంగా నష్టపోయాం



నాకు న్న ఐదెకరాల పొలంలో వరి నాట్లు వేసి నెల రోజులు కావస్తుంది. తుంగభద్ర నదికి వరద నీరు భారీగా రావడంతో మా పొలాలన్నీ నీట మునిగిపోయాయి. వరిపైర్లు వేసుకున్నాం. అయితే.. వరద నీరు పోటెత్తడంతో తీవ్రంగా నష్టపోయాం. ప్రభుత్వమే ఆదుకోవాలి

- కల్లూరు హనుమప్ప

వరి నార్లు కూడా నీట మునిగాయి



తుంగ భద్ర నదికి వరద నీరు రావడంతో మా పొలాలు నీట మును గుతున్నా యి. వరి పైర్లు వేసుకుని 20 రోజులైంది. అలాగే వరి నార్లు కూడా నీట మునిగాయి. ప్రభుత్వమే ఆదుకోవాలి.

- భోంపల్లి నగేష్, రైతు, కడిదొడ్డి

ప్రతి పైసా భక్తులకు వినియోగిస్తాం

మంత్రాలయం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠంలో ప్రతి ఏడాది ఆడిట్ చేయించడం జరుగుతుందని, 2024-25 ఏడాదికి సంబంధించిన ఆడిట్‌ను వచ్చే నెల 30వ తేదీలోపు పూర్తి చేస్తామని ఏఏవో మాధవశెట్టి, జిల్లా ఆడిట్ అసిస్టెంట్ అధికారి నరసప్ప అన్నారు. గురువారం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు ఆదేశాల మేరకు కర్నూలు నుంచి వచ్చిన సీనియర్ ఆడిటర్స్ హరిణిదేవి, సరస్వతి, మధుసాగర్‌లు ఆడిట్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీమఠం ఆడిట్ సిబ్బందికి, ప్రభుత్వ ఆడిట్ సిబ్బందికి ఏఏవో పలు సూచనలు చేశారు. మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠం భక్తులకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రతి పైసా భక్తులకు వినియోగపడే విధంగా ఖర్చు చేస్తున్నామని, ఏ ఏడాదికి ఆడిట్ పూర్తి స్థాయిలో చేయిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో క్రిష్ణమూర్తి, దత్తుస్వామి, గోపి, తదితరులు పాల్గొన్నారు.

తెలుగుదేశం పార్టీతోనే అభివృద్ధి


కొత్త మోటార్లను అందజేస్తున్న దృశ్యం

గోనెగండ్ల, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): టీడీపీ పాలనలోనే గ్రామాల అభివృద్ధి సాధ్యం అని టీడీపీ సీనియర్ నాయకులు నజీర్‌సాహెబ్, తెలుగు యువత మండల ఉపాధ్యక్షుడు ముల్లా బాషా అన్నారు. గురువారం తెలుగుయువత నాయకుడు ముల్లా బాషా తన స్వంతఖర్చు రూ. 28000తో ఎస్సీ కాలనీలో కోళాయిలకు నీటి మోటర్‌ను అందజేశారు. దీంతో ఎస్సీ కాలనీ వారు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ముల్లా బాషా మాట్లాడుతూ గ్రామంలో కొన్ని ఏళ్లుగా ఎస్సీకాలనీకి తాగు నీటి సమస్య ఉండేదని ఆ సమస్య పరిష్కారం కోసం స్వంత ఖర్చుతో మోటర్ కొని కాలనీ తాగునీటి సరఫరా కోసం అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ టీడీపీ నాయకులు పెద్దయ్య, కౌలుట్ల, మాణిక్యం, రవి, మదన్న, నతానియల్, జయరాజు, ఏఫాన్ పాల్గొన్నారు.

అర్హులైన వారికి పింఛన్లు ఇవ్వాలి

మంత్రాలయం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎన్టీఆర్ భరోసా పింఛన్‌లో బోగస్ పింఛన్లు తొలగించడమే కాకుండా రద్దు చేయడం మంచిదేననీ, కానీ అర్హులైన వారందరికీ వారి కష్టాలను చూసి పింఛన్లు అందించాలని విభిన్న ప్రతిభావంతుల యువసేన అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు పెద్దయ్య, జెట్టి వీరేష్, మేకల బంగారప్పలు అన్నారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల నుంచి దివ్యాంగులు పాల్గొన్నారు.

స్వర్ణ రథంపై ప్రహ్లాదరాయలు


స్వర్ణ రథంపై శోభిల్లిన ప్రహ్లాదరాయలు

మంత్రాలయం, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): రాఘవేంద్ర స్వామి మఠంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు స్వర్ణ రథం పై విహరించారు. శ్రావణ బహుళ త్రయోదశి గురువారం శుభదినాన్ని పురస్కరించుకుని శ్రీ మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో వేద పండితుల మంత్రోచ్చరణలు, మంగళ వాయిద్యాల, విద్యుత్ దీపాల మధ్య స్వర్ణ రథంపై ప్రహ్లాదరాయలను అధిష్టించి ఆలయ ప్రాంగణం చుట్టూ ఊరేగించారు. అనంతరం ఉత్సవ మూర్తికి ఉంజల సేవ నిర్వహించారు. మఠం పీఠాధిపతి భక్తులకు ఫల, పుష్ప, మంత్రాక్షితలు ఇచ్చి ఆశీర్వదించారు.

రాఘవేంద్రుని సన్నిధిలో బెంగళూరు డీఐజీ: బెంగుళూరు డీఐజీ చంద్రకాంత్ గురువారం రాత్రి రాఘవేంద్ర స్వామిని దర్శించుకున్నారు. గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకుని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి విశేష పూజలు చేశారు. మఠం పీఠాధిపతి మెమెంటో, శేషవస్త్రం, ఫల, పుష్ప, మంత్రాక్షితలు, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు.

రూ.2లక్షలు విరాళం: శ్రీమఠానికి కర్నాటకలోని గదక్ పట్టణానికి చెందిన రమేష్ అనే భక్తుడు అన్నదానానికి రూ. లక్ష, సంపూర్ణసేవకు రూ.లక్ష విరాళంగా ఇచ్చినట్లు మఠం ఏఏఓ మాధవశెట్టి, మేనేజర్లు ఎస్ కే శ్రీనివాసరావు, వెంకటేష్ జోషి తెలిపారు.

ఘనంగా గురుపుష్య యోగ మహోత్సవాలు : రాఘవేంద్రస్వామి సన్నిధానంలో గురువారం గురు పుష్య యోగ మహోత్సవాలు ఘనంగా జరుపుకున్నారు. గురువారం మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల ఆధ్వర్యంలో రాఘవేంద్రస్వామి అష్టోత్తర పారాయణంతో మఠం ప్రాంగణం మార్మోగింది. ఉంజల మండపంలో రాఘవేంద్రస్వామి ప్రతిమకు పీఠాధిపతి పూజలు చేసి గురువందనం సమర్పించారు. అనంతరం భక్తులనుద్దేశించి మాట్లాడారు. గురు పుష్యయోగంలో భాగంగా గురువులను స్మరిస్తే అష్టైశ్వర్యాలు, సర్వసంపదలు, సర్వ ఆరోగ్యం సిద్ధిస్తుందని తెలిపారు.

కిక్కిరిసిన భక్తులు : రాఘవేంద్ర స్వామి దర్శనార్థం వచ్చిన భక్తులతో కోలాహలంగా మారింది. గురువారం రాఘవేంద్రస్వామి సజీవ సమాధి పొందిన దినం కావటంతో దక్షణాది రాష్ట్రాలనుంచి వే లాది మంది భక్తులు తరలివచ్చారు. దీంతో మఠం ప్రాంగణం భక్తులతో కిక్కిరిసింది.

భక్తులకు సౌకర్యాలు కల్పిస్తాం

మంత్రాలయం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): రాఘవేంద్రస్వామి దర్శనార్థం వచ్చే భక్తులకు, వివిధ గ్రామాల నుంచి వచ్చే ప్రయాణీకులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని ఎమ్మిగనూరు డిపో మేనేజర్ మద్దిలేటి నాయుడు తెలిపారు. గురువారం మంత్రాలయం బస్టాండును ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యక్రమంలో కంట్రోలర్ భాస్కర్ పాల్గొన్నారు.

మహిళ బ్యాగులో బంగారు చోరీ

ఎమ్మిగనూరు, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు పట్టణంలోని ఏపీఎస్ఆర్టీసీ బస్టాండ్‌లో గురువారం సీ బెళగల్ గ్రామానికి చెందిన పద్మావతి అనే మహిళ బట్టల సంచిలో ఉన్న పర్సులోని బంగారు గొలుసును గుర్తుతెలియన వ్యక్తులు దొంగలించారు. వివరాలు.. సీ బెళగల్ గ్రామానికి చెందిన పద్మావతి ఆదోనిలో ఉన్న తన కూతురును చూసేందుకు ఊరునుంచి బయలుదేరి ఎమ్మిగనూరు బస్టాండుకు చేరుకుంది. ఆమె చేతిలోఉన్న బట్టలసంచితో ఆదోని బస్సు ఎక్కే క్రమంలో రెండు తులాల బంగారు గొలుసు, రూ. 500 ఉన్న పర్సును సంచిలో నుంచి గుర్తుతెలియని వ్యక్తులు దొంగలించారు. ఆమె బస్సులోకి ఎక్కి సంచిలో ఉన్న పర్సు కనిపించకపోవటంతో బస్సుదిగి లబో దిబో మంటు బస్టాండులో ఉన్న ఆర్టీసీ సిబ్బందికి ఫిర్యాదు చేసింది. దీంతో వారు పట్టణ పోలీసు స్టేషన్ లో ఫిర్యాదు చేయాలని చెప్పటంతో ఆమె పట్టణ పోలీసుస్టేషన్‌కు వెళ్తున్నట్లు తెలిపింది. కాగా ఈ సంఘటనపై పట్టణ ఎస్ఐ శ్రీనివాసులును వివరణ కోరగా బస్టాండ్‌లో పర్సుపోయిందని మహిళ వచ్చిందని, దానిపై విచారించి చర్యలు తీసుకుంటామన్నారు.

మహిళల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి



మహిళలతో కలిసి ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి

ఎమ్మిగనూరు, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): మహిళల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి అన్నారు. సూపర్ సిక్స్‌లో భాగంగా మహిళలకు ఉచితంగా బస్సుప్రయాణంపై గురువారం పట్టణంలోని తేరుబజారులో పెద్దఎత్తున మహిళలతో సభ నిర్వహించి, పలువురు మహిళలను సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీవీ మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతీ పథకం మహిళలను బలోపేతంచేయడం కోసమే అన్నారు. మహిళలను ఆర్థికంగా నిలబెట్టాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ప్రజలకు ఉపయోగపడే మంచి కార్యక్రమాలు చేస్తుంటే వైసీపీ ప్రతిపనికి అడ్డుపడుతూ తప్పుడు ప్రచారాలు చేస్తోందన్నారు. పింఛన్లు పెంచిన ఘనత చంద్రబాబుదేనన్నారు. రీ వెరిఫికేషన్‌లో అర్హత ఉన్న పింఛన్లు తిరిగి తీసుకుంటామన్నారు. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని హామీ ఇచ్చారు. ప్రభుత్వం చేస్తున్న సుపరిపాలనతో ప్రతివర్గం సంతోషంగా ఉందని, ఇది జీర్ణించుకోలేని వైసీపీ ప్రజలను మభ్యపెట్టి కార్యక్రమాలు చేస్తోందని ఆరోపించారు. రాష్ట్రంలో స్త్రీశక్తి పథకం కింద ఉచితబస్సు ప్రయాణాన్ని మహిళలకు కల్పించటంతో వైసీపీలో వనుకు ప్రారంభమైందన్నారు. దీంతో మాజీ సీఎం జగన్ పిల్లి శాపాలు పెడుతున్నారని, సీఎం చంద్ర బాబు వయస్సు గురించి మాట్లాడటంపై మండిపడ్డారు. అనంతరం పీఎం మోది, సీఎం చంద్రబాబు, డిప్యూటి సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్‌ల చిత్రపటాలకు మహిళలతో కలిసి క్షీరాభిషేకం చేశారు. తేరుబజారునుంచి కుర్ణి కమ్యూనిటి హాల్ వరకు మహిళ లతో కలసి ర్యాలీలో పాల్గొన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, సరోజమ్మ, స్వాతి, తిప్పమ్మ, సుందరీభాయి, బడేబీ, శంకరమ్మ, నాయకురాళ్లు, ఈరమ్మ, దేవమ్మ, పద్మ, పార్వతి, సుజాత పాల్గొన్నారు.

నందవరం: మండలంలోని అన్ని గ్రామాల నుంచి గురువారం బస్సు యాత్ర సభకు మహిళలు బయలుదేరారు. ఎమ్మిగనూరులో బస్సు యాత్ర సభకు నందవరం మండలం నుంచి మహిళలు అధిక సంఖ్యలో బయలు దేరారు. ఈ సందర్భంగా టీడీపీ మండల కన్వీనర్ కాశీంవలి, డబ్బా ఈరన్న, నందవరంలో బెస్తా ఈరన్న, నాగలదిన్నెలో తెలుగు ఈరన్న, జబ్బార్, వహబ్, తిమ్మప్ప, సుదీర్, కిషోర్, హలహర్విలో దావీదు,నాగరాజు, దాసు ఆయా గ్రామాల్లో మహిళా బస్సులను నాయకులు ప్రారంభించి ఎమ్మిగనూరుకు తరలించారు. ఈ సందర్భంగా కాశీంవలీ మాట్లాడుతూ స్త్రీ శక్తి బస్సు మహిళలకు వరంలాంటిదన్నారు.

ఉరుకుందలో ప్రత్యేక పూజలు

కౌతాళం, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రసిద్ద పుణ్యక్షేత్రమైన ఉరుకుంద ఈరన్న స్వామి శ్రావణ మాసపు ఉత్సవాలలో భాగంగా నాల్గవ గురువారం రోజున భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి స్వామి వారిని దర్శించుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు. అర్చకులు స్వామి వారి మూలవిరాట్‌ను వెండి అలంకరణ చేపట్టి భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులు దేవాలయం ఆవరణంలోనే ప్రత్యేక వంటకాలను చేసి స్వామి వారికి నైవేద్యంగా సమర్పించారు.

ఎఫ్ఆర్ఎస్ యాప్‌ను రద్దు చేయాలి

గోనెగండ్ల, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం వెంటనే ఎఫ్ఆర్ఎస్ యాప్‌ను రద్దు చేయాలని, అంగ న్‌వాడీ వర్కర్స్‌కు వేతనాలు పెంచాలని అంగ న్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు వరలక్ష్మి, పుష్పావతి, సీఐటీయూ నాయకులు కరుణాకర్ డిమాండ్ చేశారు. డిప్యూటీ తహసీల్దార్ రఘువీరకు వినతి పత్రం అందజేశారు కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు నబిరసూల్, రామలింగమ్మ, శారదమ్మ, నాగలక్ష్మి, వెంకటేశ్వరమ్మ, కృష్ణవేణి, నాగమ్మ, సుజాత, రషీద, అనురాధా, జైతున్‌బీ, జయలక్ష్మి కార్యకర్తలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

కోసిగి ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ టీచర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్, సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గురువారం కోసిగి తహసీల్దార్ కార్యాలయం ముందు అంగన్‌వాడీ టీచర్లు ధర్నా చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీలు హెబ్సిబారాణీ, లూసమ్మ, వరలక్ష్మి, సుజాత, మండలంలోని అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

పాలక మండలికి నామినేషన్లు

కౌతాళం, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయంపు పాలక మండలి ఏర్పాటు కూటమి ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా గురువారం రోజు పాలక మండలి ఏర్పాటుకు మండలంలోని టీడీపీ నాయకులు తాము పాలక మండలిలో పదవులను భర్తీ చేసుకునేందుకు నామినేషన్ల దరఖాస్తులను పూర్తి చేసి ఆలయ అధికారులకు సమర్పించారు. ప్రస్తుతం కౌతాళం మండలం నుంచి చెన్నబసప్ప, కోట్రేష్‌గౌడ్, దొడ్డనగౌడ్, రమేష్‌గౌడ్, కురుగోడు, రాజబాబు, మంత్రాలయం నుంచి ఎల్లారెడ్డి, కోసిగి నుంచి నరసన్న దరఖాస్తు చేసినట్లు తెలిపారు

ఎల్ఆర్ఎస్ చేసుకోకపోతే కఠిన చర్యలు

ఎమ్మిగనూరు, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): పట్టణంలో అనధికారికంగా ఉన్న ప్లాట్ల, వెంచర్లు, ఇంటి స్థలాలను ఎల్ఆర్ఎస్ చేసుకోక పోతే కఠిన చర్యలు తప్పవని ఎమ్మిగనూరు మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారి రాజేష్ అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2020 వరకు 92 అనధికారిక లే అవుట్లు ఉన్నాయని ప్రస్తుతం మరో 20 అనధికారికి లే అవుట్లను గుర్తించామన్నారు. ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ చేసుకునేందుకు జీఓ జారీ చేసిందన్నారు. దీంతో పట్టణంలో ప్రజలకు, వ్యాపారులు, డెవలపర్స్‌కు అవగాహన కల్పించటంతో ఇప్పటివరకు 58 వెంచర్ల యజమానులు ఎల్ఆర్ఎస్ చేసుకొని అప్రువల్ తీసుకున్నారన్నారు. మిగిలిన 54 వెంచర్ల యజమానులు వెంటనే ఎల్ఆర్ఎస్ చేసుకోవాలని సూచించారు. ఎల్ఆర్ఎస్ చేసుకోవటం వల్ల ఎల్‌పీ నంబర్ వస్తుందని దీంతో క్రయవిక్రయాలు సులువుగా చేసుకోవచ్చన్నారు. అలాగే భవన అనుమతులు, బ్యాంకు రుణాలు లభిస్తాయన్నారు. ఎల్ఆర్ఎస్‌ని సద్వినియోగం చే సుకోక పోతే భవిష్యత్తులో కఠిన చర్యలు ఉంటాయన్నారు. సచివాలయ ఇంజనీర్లు, మున్సిపల్ లైసెన్స్ ఇంజనీర్లు ప్రభుత్వం కల్పించిన ఎల్ఆర్ఎస్‌పై అవగాహన కల్పించాలని కోరారు.

రైతులకు న్యాయం చేస్తాం


రైతులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

కోసిగి ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): కోసిగి మండల పరిధిలోని ఐరంగల్ గ్రామంలో రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణంలో భూమి కోల్పోయిన రైతులకు న్యాయం చేస్తామని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్యభరద్వాజ్ అన్నారు. గురువారం మండల పరిధిలోని ఐరంగల్ గ్రామంలో రైతులతో కోసిగి తహసీల్దార్ వేణుగోపాల్ ఆధ్వర్యంలో రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదోని సబ్ కలెక్టర్ మౌర్యభరద్వాజ్ మాట్లాడుతూ రైతులకు రైల్వే ఫ్లైఓవర్ కోసం భూమి కోల్పోయిన బాధిత రైతులకు ఎకరాకు రూ.11లక్షల ప్రకారం పరిహారం అందిస్తామని, అయితే రైతులు ఎకరాకు రూ.20 లక్షలు మేర ఆశిస్తుండటంతో జిల్లా అధికారులకు నివేదిక పంపిస్తామన్నారు.